**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 70, పేజీలు - 08

సోమవారం, సెప్టెంబర్ 7, 2026 వెల: 5 రూ/.











## కాంగ్రెస్ 1000 రోజుల పాలన

# అట్టర్‌ఫ్లాప్

### - లక్షలాది మంది రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటం



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో నేతలతో కీలక విషయాలపై కేసీఆర్ చర్చించారు.

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 1,000 రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అయిందని, రాష్ట్రంలో నడుస్తోంది థర్డ్ క్లాస్ పరిపాలన అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించారు. త్వరలో తాను ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎండగట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ నేతలకు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయనే విషయం ఆ పార్టీ నేతలకే అర్థమైందని, అందుకే రాష్ట్రంలో దోపిడీకి పాల్పడుతున్నారని కేసీఆర్ ఆరోపించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో

2లో..

2029 నాటికి డ్రగ్స్ రహిత

# భారతదేశమే లక్ష్యం

### - అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు. "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్ను

2లో..

## తెలంగాణ శాసనసభా పర్వం

### - వ్యూహ ప్రతివ్యూహాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు అధికార ప్రతిపక్ష పార్టీలు రెడీ అవుతున్నాయి. తెలంగాణా శాసన సభ సమావేశాలు నేడు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం సభలో పలు కీలక బిల్లులను ప్రవేశ పెట్టనుంది. 21 ఏళ్లకే చట్ట సభలకు పోటీ చేసే

2లో..



## ఏపీలో కొత్త పింఛన్లు

2లో..

### - దరఖాస్తులకు ప్రభుత్వం శ్రీకారం





## అమరావతికి సరికొత్త కాంతి

### - తిరుమల తరవాత అక్కడే ఆ స్థాయిలో శ్రీవారి క్షేత్రం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** అమరావతి అంటే ఇక కేవలం పరిపాలనా నగరమో, సాంకేతిక హబ్ మాత్రమే కాదు భక్తి పారవశ్యం విరబూసే దివ్య ఆధ్యాత్మిక కేంద్రం కూడా! ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిని 'టెంపుల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. రాజధాని పరిధిలోని వెంకటపాలెంలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల క్షేత్రం తరహాలోనే అత్యంత వైభవంగా అభివృద్ధి చేసే బృహత్తర పనులు ఇప్పుడు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.260 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టినఈ విస్తరణ పనులతో అమరావతి రూపురేఖలు మారిపోతున్నాయి. అమరావతి రాజధాని ప్రాంతంలో ఆధునికతతో పాటు ఆధ్యాత్మికతను సమాంతరంగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా వెంకటపాలెం శ్రీవారి ఆలయాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య సన్నిధిని భక్తులకు మరింత చేరువ చేసేందుకు రెండు దశల్లో అభివృద్ధి పనులను టీటీడీ నిర్వహిస్తోంది.

2లో..

## పరీక్ష పాసయ్యారా.?

### రికమండేషన్‌తో జాబ్‌లోకి వచ్చారా?

### - డీజీపీపై కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇటీవల కాలంలో మహిళలందరినీ ఇబ్బంది పెట్టే విధంగా సోషల్ మీడియాలో దారుణంగా ట్రోలింగ్స్ జరుగుతున్నాయని, అయినా సరే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ తనను అసభ్యకరంగా కామెంట్ చేసి పోలీసును అరెస్ట్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. డీజీపీ పరీక్ష పాసై డీజీపీ అయ్యారా? రికమండేషన్‌పై

2లో..



## హైదరాబాద్‌లో పాతాళానికి

# భూగర్భ జలాలు

### - ఏడాదిలోనే 5 మీటర్ల లోతుకు నీళ్లు! - రానున్న రోజుల్లో ఇక కష్టమే!

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో ఈ ఏడాది వర్షాల కారణంగా భూగర్భ జలాల పరిస్థితిలో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ గత ఏడాది నమోదైన భారీ లోటును పూర్తిగా పూడ్చే స్థాయిలో మాత్రం పునరుద్ధరణ జరగలేదు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తీరులో వచ్చిన మార్పులు, ఈ ఏడాది లోటు వర్షాలతో నగరంలో భూగర్భ జలాలపై ఒత్తిడి మరింత పెరిగింది. భూగర్భ జలాల శాఖ తాజా అంచనాల ప్రకారం 2026 ఆగస్టులో హైదరాబాద్‌లో సగటు భూగర్భ జల మట్టం 11.20 మీటర్ల లోతులో నమోదైంది. 2025 ఆగస్టులో ఇది 6.36 మీటర్లుగా ఉండేది. అంటే కేవలం ఏడాది వ్యవధిలోనే సగటు నీటిమట్టం దాదాపు ఐదు మీటర్లు లోతుకు పడిపోయింది. నగరంలోని ఉత్తర, వాయవ్య, తూర్పు ప్రాంతాలతో పాటు వేగంగా పట్టణీకరణ చెందుతున్న నగర దక్షిణ శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్‌లో తీవ్ర లోటు నమోదైంది. అక్కడ ఆగస్టులో భూగర్భ జల మట్టం 39.89 మీటర్ల లోతులో నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో 14.15 మీటర్లుగా ఉండగా ఏకంగా 27.74 మీటర్ల తేడా కనిపించింది. తిరుమలగిరిలో 13.73 మీటర్ల పతనంతో నీటిమట్టం 17.68 మీటర్లకు చేరింది. మారేడ్‌పల్లిలోని 12.97 మీటర్ల మేర పడిపోయాయి. శేరిలింగంపల్లి, మేడిపల్లి, మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, హాఫీజ్‌పేట్ ప్రాంతాల్లోని పలు కేంద్రాల్లోనూ గణనీయమైన వార్షిక పతనం నమోదైంది. ఈ పరిస్థితికి లోటు వర్షపాతం ప్రధాన కారణాల్లో ఒకటిగా అధికారులు, నిపుణులు చెబుతున్నారు. ఆగస్టు వరకు హైదరాబాద్‌కు సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం రావాల్సి ఉండగా 360 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో 22 శాతం లోటు ఏర్పడింది. పర్యవేక్షణలో ఉన్న 46 మండలాల్లో 28 మండలాల్లో లోటు వర్షపాతం, 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా ఒక్క మొయినాబాద్‌లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అయితే, వర్షాలు తక్కువగా పడటంతో పాటు కురిసిన వర్షపు నీటిని సమర్థంగా ఒడిసిపట్టుకుని భూగర్భంలోకి పంపే రీచార్జ్ వ్యవస్థలు తగినంతగా పనిచేయకపోవడం కూడా సమస్యను తీవ్రతరం చేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న కాంక్రీట్

2లో..

## వ్యక్తులకు భయపడే స్థాయిలో అధిష్టానం లేదు

### - కొండా సురేఖ బర్తరఫ్‌పై మంత్రి సీతక్క



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ మంత్రి కొండా సురేఖ క్యాబినెట్ బర్తరఫ్‌పై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. కొల్లాపూర్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పార్టీలో క్రమశిక్షణ ఎంతో అవసరమని, నేతలు ఎవరూ పార్టీ లైన్, గీత దాటకూడదని హితవు పలికారు. ఎలాంటి సమస్యలు లేదా

2లో..

## హైదరాబాద్‌లో నర్సు హత్యాచార ఘటన

### - మెజిస్టీరియల్ విచారణకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగర శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్న యువతి హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం రేవంత్ రెడ్డి మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. అంతేకాకుండా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏమైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అన్న అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

2లో..



## ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై

# డీజీపీ సీరియస్

### - బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో

2లో..





## ఐరాస కొత్త ప్రపంచ మ్యాప్‌కు

# భారత్ ఓకే

### - కానీ, ఆ ఒక్క విషయంలో మాత్రం అభ్యంతరం

2లో..



## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

### - ముగ్గురు మృతి, శిథిలాల కింద చిక్కుకున్న పలువురు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక

2లో..

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్

ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉభయ సభల్లో జరిగే ప్రతి చర్చలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, ప్రజల అజెండానే పార్టీ అజెండాగా మార్చుకుని ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. స్పీకర్ పక్షపాత వైఖరి చూపిస్తే ఎండగట్టాలని సూచిస్తూ, సభలో హామీల అమలుపై ప్రశ్నల వర్షం కురిపించాలని దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన చేతగాక బయట, అసెంబ్లీలో చిల్లర బూతులు మాట్లాడుతున్నారని, ప్రతిపక్షంలో ఉన్న తమపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ ఆక్రోశాన్ని అసెంబ్లీ వేదికగా బలంగా వినిపించే బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలు, రైతు భరోసా, రుణమాఫీ అమలులో జరుగుతున్న జాప్యంతో పాటు పింఛన్లు పెంచుతామని మోసం చేయడంపై ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పార్టీ నేతలకు సూచించారు.

### త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి బీఆర్ఎస్ బాస్

ఈ సందర్భంగా కేసీఆర్ తన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. త్వరలోనే తాను ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక లక్ష మందితో కలిసి కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల వద్దకు స్వయంగా వెళ్తామన్నారు. తనను రాజీనామా చెయ్ అని అనడం కాదు, ప్రజాక్షేత్రంలో తాను వెళ్లాక కాంగ్రెస్ నేతలు ఏ మాట చెబుతారో చూద్దామని బీఆర్ఎస్ ఎల్పీ భేటీలో వ్యాఖ్యానించినట్లు సమాచారం.

## 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు.

### పక్కా ప్లాన్తో డ్రగ్స్ నివారణ

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్వర్క్ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది.

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌ను (ఏఎన్టీఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు."మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం.

అంతేకాదు డ్రగ్స్కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్‌లైన్ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

## అమరావతికి సరికొత్త కాంతి

తొలి దశలో భాగముగా ఆలయానికి రెండవ ప్రాకారం, అద్భుత శిల్పకళతో కూడిన ఏడంతస్తుల మహా రాజగోపురం, అర్చకులు, భక్తుల కోసం ఆర్జిత సేవా మండపం, రథ మండపం, వాహన మండపం, దివ్య పుష్కరిణి, ప్రాంగణంలో ఐదు ముఖాల అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇక రెండో దశలో భక్తుల సౌకర్యార్థం విస్తృతమైన మాడ వీధులు, విశాలమైన అప్రోచ్ రోడ్లు, వేలాది మందికి నిత్యాన్నదానం అందించే భారీ అన్నదాన కాంప్లెక్స్, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల కోసం అధునాతన విశ్రాంతి భవనాలు, అర్చకులు-సిబ్బంది నివాస గృహాలు, పరిపాలనా భవనాలను టీటీడీ నిర్మించనుంది.ఇటీవలే వెంకటపాలెం ఆలయ నిర్మాణ పనులను టీటీడీ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండో ప్రాకారం, నాలుగు దిక్కులా నిర్మిస్తున్న గాలి గోపురాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను,ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిరంతరం ప్రగతి నివేదికలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.ఒకవైపు రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ, ఐటీ, క్వాంటమ్ సాంకేతిక ప్రాజెక్టుల వంటి ఆధునిక నిర్మాణాలతో అమరావతి ప్రగతి పథంలో దూసుకుపోతుండగా మరోవైపు శ్రీవారి ఆలయం, ఆధ్యాత్మిక ఉత్సవాల ద్వారా పర్యాటక, వ్యాపారరంగాలకు ఊతమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించినట్లుగా అమరావతిని నిజమైన "దేవతల రాజధానిగా మలచాలనే దిశగా అడుగులు పడుతున్నాయి.

వెంకటపాలెం శ్రీవారి ఆలయంతో పాటు, అమరావతిలోని ప్రాచీన పంచారామ క్షేత్రమైన అమరలింగేశ్వర స్వామి ఆలయం, అనంతవరం కొండపై వెలసిన మీసాల వెంకన్న స్వామి ఆలయం, వైకుంఠపురం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను కలుపుతూ ఒక సమగ్ర "ఆధ్యాత్మిక సర్క్యూట్" రూపొందించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది.ఆధ్యాత్మిక సర్క్యూట్ తో పాటు బౌద్ధ ఆధ్యాత్మిక కేంద్రాలు, చారిత్రక ప్రదేశాలను అనుసంధానిస్తే అమరావతికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, భక్తుల తాకిడి విపరీతంగా పెరుగుతుంది. దీనివల్ల అమరావతిలో నూతన "టూరిజం ఎకానమీ" రూపుదిద్దుకుంటుంది. భక్తుల రాక పెరిగే కొద్దీ స్థానికంగా హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, పార్కింగ్ సదుపాయాలు, షాపింగ్ మాల్స్ వంటి సేవా రంగాలకు అపారమైన డిమాండ్ ఏర్పడి వేలాది మంది యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయి.వెంకటపాలెం శ్రీవారి ఆలయ విస్తరణ పూర్తయితే, తిరుమల తర్వాత ఆంధ్రప్రదేశ్లోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రధాన శ్రీవారి క్షేత్రంగా ఇది రికార్డులకెక్కనుంది. పరిపాలనా నగరంగా ప్రస్థానం ప్రారంభించిన అమరావతి, రాబోయే రోజుల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక రాజధానిగా దేశ పటంలో ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఏపీలో కొత్త పింఛన్లు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు గానూ నూతన పింఛన్లు మంజూరు చేస్తోంది. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకం కింద కొత్త పింఛన్లకు నేటి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 7 నుంచి సెప్టెంబర్ 16వ తేదీ వరకూ నూతన పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

సెప్టెంబర్ 17 నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకూ దరఖాస్తుల సాధారణ పరిశీలన ఉంటుంది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి సెప్టెంబర్ 24వ తేదీ వరకూ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి శాఖాపరమైన ధ్రువీకరణ ప్రక్రియ ఉంటుంది. అలాగే అర్హతలపై నిర్ణయం తీసుకుంటారు. సెప్టెంబర్ 25 నుంచి సెప్టెంబర్ 26 వరకూ రెండు రోజుల పాటు సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పిస్తారు. దీనికి ప్రభుత్వ ఆమోదం ప్రక్రియ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.మరోవైపు అర్హులైన వారు తమకు సమీపంలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో తమ దరఖాస్తులను సమర్పించేందుకు అవకాశం ఉంది. దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. అలాగే దరఖాస్తుదారులకు కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకం కింద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయనున్నారు.ఆయా విభాగాల్లో అర్హులైన వారు అవసరమైన పత్రాలతో తమకు సమీపంలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు వెళ్ళి తమ దరఖాస్తులను అందించవచ్చు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత అర్హత కలిగిన వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 62 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రతి నెలా అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, వివిధ కారణాలతో పింఛను అందుకోలేకపోయినవారికి, కొత్తగా అర్హత సాధించిన వారికి పింఛన్లు అందించే ఉద్దేశంతో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

## తెలంగాణ శాసనసభా పర్వం

అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనతో పాటు క్యూర్, ల్యాండ్ పూలింగ్, 22ఏ భూములు, భూసేకరణ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేలా ప్లాన్

మరోవైపు శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అధికారులు సహకరించాలని, సమన్వయంతో పనిచేయాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌లు సూచించారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా ప్రశాంతంగా సమావేశాలు జరిగేలా చూడాలని, సమావేశాలు జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి మంత్రులకు, సభ్యులకు సహకరించాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సహకారముంటుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

### అధికార ప్రతిపక్ష పార్టీల వ్యూహాలు

శాసన సభ సమావేశాలు సజావుగా జరిగేలా, ప్రతిపక్షాలను నిలువరించేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార పక్ష సభ్యులు కూడా అన్ని విధాలా సన్నద్ధమవుతున్నారు. సభలో ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా వ్యూహాలతో సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించబడింది.

### ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ కీలక ఆదేశం

సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.నేటి నుండి ప్రారంభం అవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ నేతలతో విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ విధానాలపై, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలనే అంశాలపై ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

### ప్రజల సమస్యలను ప్రభావవంతంగా లేవనెత్తాలన్న కేసీఆర్

పార్టీ కార్యాచరణను మరింత బలోపేతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆయన సలహాలు అందించారు. ఈ సమావేశం ద్వారా బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రజల సమస్యలను ప్రభావవంతంగా లేవనెత్తాలని కేసీఆర్ సూచించినట్లు తెలిసింది. సమావేశం అనంతరం పార్టీ నాయకులు తమ తమ నియోజకవర్గాల్లో కార్యాచరణను ముమ్మరం చేయనున్నారు.

## ఐరాస కొత్త ప్రపంచ మ్యాప్‌కు భారత్ ఓకే

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భూభాగాల వాస్తవ పరిమాణాలను కచ్చితంగా ప్రతిబింబించేలా సమాన విస్తీర్ణ ప్రపంచ పటాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు వేసినట్లు విదేశాంగ శాఖ ఆదివారం తెలిపింది. అయితే, ఈ తీర్మానం ఏ నిర్దిష్ట మ్యాప్‌ను ఆమోదించదని, భారత అధికారిక పటానికి అనుగుణంగానే దేశ సార్వభౌమ భూభాగాన్ని చిత్రించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. "ఈ తీర్మానం ఏ నిర్దిష్ట ప్రపంచ పటాన్ని స్వీకరించదు లేదా ధ్రువీకరించదు అలాగే అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు లేదా ప్రాంతాల పేర్లతో సహా రాజకీయ మ్యాప్‌ల విధానాన్ని ఇది ప్రస్తావించదు" విదేశాంగ శాఖ తెలిపింది.అయినప్పటికీ, భారత్ జమ్మూ కశ్మీర్, లడఖ్‌లపై తన వైఖరిని పునరుద్ఘాటించింది. "జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు సహా భారతదేశ సార్వభౌమ భూభాగం తప్పనిసరిగా భారత్ అధికారిక మ్యాప్‌నకు అనుగుణంగానే చూపాలి తప్పుగా లేదా తప్పుదోవ పట్టించేలా చిత్రీకరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారతదేశ సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతపై మా వైఖరి స్పష్టమైంది, స్థిరమైంది రాజీలేనిది" అని భారత్ తెలిపింది.ఖండాల భూభాగాల పరిమాణ నిష్పత్తిని సరిగ్గా చూపే సమాన విస్తీర్ణ పటాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'కరెక్ట్ ది మ్యాప్: రీబ్యాలెన్సింగ్ గ్లోబల్ కార్టోగ్రాఫిక్ రిప్రజెంటేషన్ అండ్ ప్రమోటింగ్ ఈక్విటబుల్ రిప్రజెంటేషన్ ఆఫ్ ది వరల్డ్స్ రీజియన్స్, పార్టిక్యులర్లీ ఆఫ్రికా" అనే పేరిట తెచ్చిన ఈ తీర్మానాన్ని సెప్టెంబర్ 4న ఐరాస సర్వసభ్య సమావేశం 164-1 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. ఈ తీర్మానం ఖండాల విస్తీర్ణాన్ని సరిగ్గా చూపించే సమాన విస్తీర్ణ మ్యాప్‌ను వాడకాన్ని ప్రోత్సహిస్తుంది. అయితే, ఇది ఏ నిర్దిష్ట పటాన్ని, ప్రొజెక్షన్‌ను లేదా జాతీయ సరిహద్దుల చిత్రీకరణను ఆమోదించినట్లుగా భావించకూడదని భారత్ స్పష్టం చేసింది. "ఈ తీర్మానాన్ని సమాన విస్తీర్ణ మ్యాప్ ప్రొజెక్షన్ల విస్తృత వినియోగానికి మద్దతుగా మాత్రమే అర్థం చేసుకోవాలని, అంతే తప్ప 'ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్' లేదా ఇతర నిర్దిష్ట మ్యాప్ ప్రొజెక్షన్లను ఆమోదించినట్లుగా భావించకూడదని మేము నమ్ముతున్నాం" అని భారత దౌత్యవేత్త రఘు పూరి ఓటింగ్ సందర్భంగా పేర్కొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీరియస్

ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.

ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

## హైదరాబాద్‌లో నర్సు హత్యాచార ఘటన

ఈ కేసులో నిందితుడిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు.

ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

ఇక, ఈ ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే, బాధిత యువతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం తరఫున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్కలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని తెలిపారు.

### అసలేం జరిగిందంటే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి ఏడు నెలలుగా రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆసుపత్రి సమీపంలో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వసతి గదిలో నివాసం ఉంటోంది. అయితే ఆమెపై బీహార్‌కు చెందిన బైక్ మెకానిక్ సనా ఉల్లాఖాన్ హత్యాచారం చేశాడు. 2023లో పని నిమిత్తం హైదరాబాద్ వచ్చిన సనా ఉల్లాఖాన్ ఆ నర్సు నివసించే గది వెనుక కిటికీకి సమీపంలో ఉన్న ఒక గ్యారేజీలో పని చేస్తున్నాడు.

నేరానికి సుమారు నెల రోజుల ముందు అతను కిటికీ ద్వారా బాధితురాలిని మొదటిసారి గమనించారు. అయితే యువతిపై కన్నేసిన సనా ఉల్లాఖాన్ ఆమె కదలికలను గమనించడం ప్రారంభించాడు. ఆ యువతి నిద్రిస్తున్న సమయంలో నిందితుడు సనా ఉల్లాఖాన్ కిటికీ ద్వారా ఆమె గదిలోకి ప్రవేశించారు. ఇది గమనించిన యువతి కేకలు వేసే ప్రయత్నం చేసింది. అయితే ఆమె నోరు మూసిన నిందితుడు లైంగిక దాడికి ప్రయత్నించాడు. యువతి ప్రతిఘటించడంతో అతను ఆమెను గొంతు నులిమి చంపి, అదే కిటికీ ద్వారా పారిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, ఊపిరాడక అపస్మారక స్థితికి చేరిన యువతిపై నిందితుడు అఘాయిత్యానికి తెగబడినట్టుగా తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకన్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## పరీక్ష పాసయ్యారా.?

వచ్చారని అని ప్రశ్నించారు. మహిళలపై అసభ్యంగా మాట్లాడితే శిక్షించేందుకు ఎన్నో చట్టాలు ఉన్నాయని, అయినా సరే సోషల్ మీడియాలో, ఇన్‌స్టాగ్రామ్‌లో అడ్డగోలుగా మాట్లాడితే చర్యలు తీసుకోవటం లేదు? ఇక చట్టాలు ఉండి ఏం లాభం? అని ప్రశ్నించారు.

### అసభ్యంగా మాట్లాడితే కేసులు నమోదు

"ప్రజాప్రతినిధులు చేసే చట్టాలను ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అమలు చేయాలి. ముఖ్యంగా శాంతి భద్రతలను రక్షించాల్సింది పోలీసులు. ఒకసారి ఎంపీగా, ఎమ్మెల్సీ గా, 20 ఏళ్లు ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తిని నేను. ఇప్పుడు సొంతంగా ఒక పార్టీ పెట్టుకున్నాను. నాలాంటి వ్యక్తిపైనే అత్యంత అసభ్యంగా దూషణలు చేస్తున్నారు. అయినా సరే పోలీసులు పట్టించుకోవటంలేదు. ఇక సామాన్య మహిళలకు ఇబ్బందులు వస్తే వాళ్లు ఎవరికీ చెప్పుకుంటారు? నన్ను సోషల్ మీడియాలో అత్యంత దారుణంగా దూషించిన ఓ పోలీసును సస్పెండ్ చేసి డీజీపీ చేతులు దులుపుకున్నారు. అతన్ని ఎందుకు రిమూవ్ చేయలేదు? ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు ఎందుకు పెట్టలేదు? మహిళల పట్ల ఒక్క పదం అసభ్యంగా మాట్లాడిన సరే కేసులు నమోదు చేయాలని చట్టాలు ఉన్న సంగతి డీజీపీకి తెలియదా? భారత న్యాయ సంహిత 356, 79, ఏటీ సెక్షన్లు ఉన్న సంగతి ఆయన తెలియదా? తెలియకపోతే డీజీపీ ఈ చట్టాలను చదువుకోవాలని కోరుతున్నాను" అని కవిత అన్నారు.

### ఆ చట్టం సంగతి డీజీపీకి తెలియదా?

మహిళలపై అసభ్యంగా కామెంట్స్ చేస్తే 3 ఏళ్ల జైలు శిక్ష విధించాలని ఐటీ చట్టంలో ఉందని కవిత అన్నారు. డిపార్ట్ మెంట్లో కూడా రూప్ ఆఫ్ 3, రూప్ ఆఫ్ 2 ప్రకారం డిసిప్లేనరీ చట్టాలు ఉన్నాయన్నారు. డిపార్ట్మెంట్లో ఎవరిమీదనైనా చర్యలు తీసుకుంటే ఆ చర్యలు అసంపూర్తిగా ఉండకూడదన్న చట్టం ఉన్న సంగతి డీజీపీకి తెలియదా? అని మండిపడ్డారు. డీజీపీకి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వాళ్లపై కూడా ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? అని నిలదీశారు. తన మీద అసభ్యంగా కామెంట్లు చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హేట్ స్పీచ్ మీద బిల్లు

సీఎం రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్ మీద బిల్లు తెస్తానని అంటున్నారని, ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆ బిల్లు తేవాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్నంత పనిచేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి న్యాయం చేస్తానని మాట ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమకారుడు కాదని, ఆయనను ఉద్యమకారులు నమ్మలేదన్నారు. ఆయన పక్కనే కోదండరాం ఉండటంతోనే రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. కానీ మూడేళ్లలో వాళ్లకు చీమ కాలంతా పని కూడా జరగలేదని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులు భూపోరాటాలు చేస్తే ఇష్టమొచ్చినట్లు కొట్టారన్నారు. ఉద్యమకారులపై లాఠీ ఝుళిపిస్తే ఏం వస్తుంది? వారి కుటుంబాలు మొత్తం ఆగమావుతున్నాయన్నారు.

### ఇక ఆమరణ దీక్షే

"తెలంగాణ జన సమితి తరఫున కోదండరాం ఉద్యమకారులకు ఐడెంటిటీ కార్డులు ఇచ్చారు. ఆయన ఇప్పుడు ప్రభుత్వంలో భాగంగా ఉన్నానన్న సంగతి మర్చిపోయారు. కోదండరాం మీరు ఇచ్చిన ఐడెంటిటీ కార్డులను ప్రభుత్వానికి ఇవ్వొచ్చు కదా? సీఎం మాటకు ఈ ప్రభుత్వంలో విలువ లేదా? ఉద్యమకారులను తొక్కుకుంటూ పోతూ వారికి అన్యాయం చేస్తారా? ఇప్పటికే ఉద్యమాలు చేసి వాళ్లంతా అలిసిపోయారు. ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమే. ఉద్యమకారులకు సంబంధించిన మొత్తం డేటా ప్రభుత్వం వద్ద ఉంది. కొంతమందికైనా గుర్తింపు కార్డులు ఇచ్చి ఈ ప్రాసెస్‌ను మొదలుపెట్టండి. వారికి బీమా సౌకర్యంతో పాటు పెన్షన్ ఇవ్వండి. మీరు ఇస్తామన్న హామీలు అమలు చేయండి. లేదంటే ఈ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఏ గ్రామంలో కూడా తిరగకుండా చేస్తాం. అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణీత కాలవ్యవధితో కూడిన స్పష్టమైన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి చేయాలి" అని కవిత అన్నారు.

### కులగణనలో కులం కాలమ్

అసెంబ్లీ చర్చించాల్సిన చాలా అంశాలు ఉన్నప్పటికీ వాటిని చర్చించకుండా అధికార, ప్రతిపక్షాలు డ్రామాలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఫీజు రెగ్యులేషన్, ఉద్యమకారులకు ఇస్తామన్న వాటికి సంబంధించి చట్టాలు చేయాలన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ వందరోజుల కార్యాచరణ చేస్తుందంటే నవ్వొస్తోందన్నారు. బీసీ 42 శాతం రిజర్వేషన్లు అంటూ వారి లెక్క తప్పు చూపిన పార్టీయే ఇప్పుడు బీసీల కోసం ఆందోళనలు చేస్తామంటోందన్నారు. కేంద్రం చేసే కులగణనలో స్పెసిఫిక్‌గా కులం కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో పాతాళానికి భూగర్భ జలాలు

నిర్మాణాలు, తగ్గుతున్న సహజ నీటి నిల్వ ప్రాంతాలు కూడా భూగర్భ జలాల రీచార్జ్‌పై ప్రభావం చూపుతున్నాయి.మరోవైపు.. మేలో నమోదైన ముందస్తు స్థాయితో పోలిస్తే ఆగస్టులో భూగర్భ జలాలు సగటున 0.80 మీటరు మేర పెరిగాయని అధికారులు చెబుతున్నారు. 2016--2025 దశాబ్ద సగటుతో పోలిస్తే 14 మండలాల్లో ఆగస్టు నీటిమట్టాలు మెరుగ్గా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఈ పెరుగుదల 17.07 మీటర్ల వరకు ఉందని వెల్లడించారు. అయినప్పటికీ 11 మండలాల్లో నీటిమట్టం 20 మీటర్ల కంటే లోతులోనే ఉండటం నగరానికి భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి రీచార్జ్‌పై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## వ్యక్తులకు భయపడే స్థాయిలో అధిష్టానం లేదు

అభిప్రాయభేదాలు ఉన్నా అంతర్గతంగా మాట్లాడుకోవడం ద్వారా పార్టీ బలోపేతమవ్వడంతో పాటు నేతల గౌరవం పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.పార్టీ అధిష్ఠానం ఏ ఒక్క వ్యక్తికీ భయపడే స్థాయిలో లేదని, కాంగ్రెస్ పార్టీ అంత బలహీనంగా లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. నేతలకు ఏవైనా బాధలు లేదా సమస్యలు ఉంటే నేరుగా పార్టీ పెద్దలతో మాట్లాడాలే తప్ప బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి, పార్టీకి పెద్దయిన సీఎం రేవంత్ రెడ్డిపై నేరుగా విమర్శలు చేయడం, దాడి చేయడం వంటి చర్యలను అధిష్ఠానం ఎంతమాత్రం సహించదని తెలిపారు. రేపు తాను గీత దాటినా లేదా మరెవరైనా క్రమశిక్షణ తప్పినా అధిష్టానం తీసుకునే చర్యలకు సిద్ధంగా ఉండాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన ఈ పరిణామాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు భుజాలు ఎగరేయడం విడ్డూరంగా ఉందని సీతక్క మండిపడ్డారు. గతంలో మాజీ మంత్రి కేటీఆర్ సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి ఎందుకు బయటకు పంపించారో, అలాగే అప్పటి డిప్యూటీ సీఎం రాజయ్యను ఏ కారణంతో బర్తరఫ్ చేశారో బీఆర్ఎస్ నేతలు ముందుగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కొండా సురేఖ ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని పేర్కొన్న, అందరూ సంయమనం పాటిస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై మహాధర్నాను విజయవంతం చేయాలి



పోతంగల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోతంగల్ మండల కేంద్రంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు సూదం నవీన్ పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోతంగల్ బస్టాండ్ ఆవరణలో సోమవారం నిర్వహించే మహాధర్నాకు మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్,మాజీ ఎమ్మెల్సీ వి.జి.గౌడ్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

# నిరుద్యోగులను నట్టేట ముంచి..

## తన ఇంట్లో మూడు పదవులు దక్కించుకున్నారు..


**మంత్రి వివేక్‌పై బాల్క సుమన్ ఫైర్**




కాంగ్రెస్ 1000 రోజుల పాలన మొత్తం దగా, వైఫల్యాలు, అన్ని వర్గాల విధ్వంసమే అని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మిర్యాల రాజిరెడ్డి, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 33 నెలల పాలనలో కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ కట్టలేదని బాల్క సుమన్ అన్నారు. కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చలేదని.. కానీ రాష్ట్రంపై 4 లక్షల కోట్ల పైచిలుకు అప్పుల భారం మోపారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల నిధులతో చెన్నూర్ దూసుకుపోయిందన్నారు. మందమర్రి, రామకృష్ణాపూర్‌లలో 9 విడతల్లో వేలాది మంది పేదలకు ఇండ్ల పట్టాలు పంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌ను, పారిపెల్లి, అస్నాద్ నూతన మండలాల జీవోలను రాజకీయ కక్షతో మంత్రి కావాలనే అడ్డుకున్నారని బాల్క సుమన్ అన్నారు. ఎన్నికల్లో చెన్నూర్ యువతకు 45,000 ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మంత్రి వివేక్ నిరుద్యోగులను నట్టేట ముంచారని మండిపడ్డారు. యువతకు 4 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు కానీ, వారి ఇంట్లో మాత్రం మూడు రాజకీయ పదవులు దక్కించుకున్నారని విమర్శించారు. మంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, రేపటి అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు రావాల్సిన 12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు.

## విమానం గాల్లో ఉండగా సాంకేతిక సమస్య..

# ఎమర్జెన్సీ ల్యాండింగ్..!




టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది. ఈ ఘటన బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం లో చోటుచేసుకుంది. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమానం ఆదివారం ఉదయం 8.20 గంటలకు లండన్‌కు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. విమానాన్ని అరగంటకుపైగా గాల్లో చక్కర్లు కొట్టించారు. అనంతరం వెనక్కి తీసుకువచ్చి విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బంది సహా మొత్తం 270 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానాన్ని తనిఖీలకు తరలించారు. ఘటనపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించేంత వరకు ఆందోళన

**– మాజీ మంత్రి జోగు రామన్న**



ఆదిలాబాద్ : సిమెంట్ పరిశ్రమ ను పునరుద్ధరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఆదివారం ఆదిలాబాదు లో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. సీసీఐ ని ప్రారంభిం చడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను, ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అమిత్ షా గతంలో జిల్లా పర్యటనలో భాగంగా సీసీఐ ని ప్రారంభిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని తెలిపారు. సీసీఐని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తాను త్వరలోనే అమరణ దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# చిన్నగొట్టిగల్లు రీ-సర్వేలో 'భూ' భాగోతం

## పట్టా భూముల రికార్డుల్లో మార్పులపై కలకలం

**ఎక్స్ సర్వీస్‌మ్యాన్ భూమికీ చిక్కులు,**
**నోటీసులు, విచారణ లేకుండానే మార్పులంటున్న బాధితులు**
**ప్రభుత్వ భూములకు ఎల్పీఎంలా.?**
**హైకోర్టు ఆదేశాల అమలుపైనా ప్రశ్నలు**
**కోట్లలో లావాదేవీల ఆరోపణలు,**
**సమగ్ర ప్రత్యేక ఆడిట్‌కు డిమాండ్**



చిన్నగొట్టిగల్లు(ప్రశ్న న్యూస్) భూముల రీ-సర్వే.. రైతుల భూహక్కులకు భరోసా కల్పించాల్సిన ప్రక్రియ. అయితే చిన్నగొట్టిగల్లు మండలంలో అదే రీ-సర్వే ఇప్పుడు వివాదాలకు కేంద్రబిందువైంది. భాకరాపేట, దిగవూరు గ్రామాల పరిధిలో రీ-సర్వే సందర్భంగా పాత రెవెన్యూ రికార్డులు, కొత్త రికార్డుల్లో వ్యత్యాసాలు వచ్చాయని, పట్టా భూముల వివరాలు మార్చారని, కొన్నింటిని ప్రభుత్వ భూములుగా నమోదు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. మరికొన్ని భూములకు హక్కుదారుల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఎల్పీఎంలు కేటాయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రీ-సర్వే ప్రక్రియలో జరిగినట్లు చెబుతున్న మార్పులపై జిల్లా స్థాయిలో కాకుండా ఉన్నతస్థాయి అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్రంగా విచారణ జరపాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. పాత అడంగల్, 1-బి, పట్టా పుస్తకాలు, అసైన్‌మెంట్ ఉత్తర్వులు, రీ-సర్వే రికార్డులు, ఎల్పీఎం వివరాలను ఒకదానితో ఒకటి సరిపోల్చితే అసలు విషయం బయటపడుతుందని వారు చెబుతున్నారు.

### ఎక్స్ సర్వీస్‌మ్యాన్ భూమిపైనా వివాదం

దేశ రక్షణలో సేవలందించిన ఎక్స్ సర్వీస్‌మ్యాన్ సాకిరి భూపాల్ కుటుంబానికి సంబంధించిన భూమి వ్యవహారం ఈ వివాదానికి ప్రధాన కారణంగా మారింది. భాకరాపేట పరిధిలో సర్వే నంబర్ 519-5లో 4.19 ఎకరాల భూమిని జిల్లా కలెక్టర్ కేటాయించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే రీ-సర్వే అనంతరం ఆ భూమికి సంబంధించిన వివరాల్లో మార్పులు కనిపించాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో తహశీల్దార్ కార్యాలయ రికార్డుల్లో 519/5కు సంబంధించి హక్కులపై అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ.. తాజాగా భూపాల్ పేరుతో ఉన్న ఎల్పీఎం నంబర్ 167లో ఆ వివరాలు ఎలా నమోదయ్యాయన్నది ప్రశ్నిస్తున్నారు.

తమ వద్ద ఉన్న పాత రెవెన్యూ రికార్డులు, పట్టా పత్రాలు, కలెక్టర్ ఉత్తర్వులను పరిశీలించి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### ఒకే కుటుంబ భూములపై వరుస ఆరోపణలు

భూపాల్ కుటుంబానికి సంబంధం ఉన్న మరికొన్ని భూముల విషయంలోనూ రీ-సర్వే అనంతరం రికార్డుల్లో మార్పులు జరిగాయని బాధితులు చెబుతున్నారు. చాకిరి కుమారి పేరుతో ఖాతా నంబర్ 568 కింద ఉన్న 3.54 ఎకరాల భూమిని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఇతరుల పేర్లకు మార్చినట్లు ఆరోపిస్తున్నారు.రాధ కడియాల పేరుతో సర్వే నంబర్ 482/9ఎలో ఉన్న 0.40 ఎకరాల డ.పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా చూపించారని పేర్కొంటున్నారు. చాకిరి వెంకటరత్నంకు సంబంధించిన 482/2బి సర్వే నంబర్‌లో భూమి విస్తీర్ణం కూడా తగ్గించినట్లు ఆరోపిస్తున్నారు.

ఇవన్నీ కేవలం పొరపాట్లేనా? లేక ఉద్దేశపూర్వకంగా రికార్డులు మార్చారా? అన్నది తేల్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బాధితులు అంటున్నారు.

### 329 సర్వే నంబర్‌పై మరిన్ని అనుమానాలు

భాకరాపేటలోని సర్వే నంబర్ 329 వ్యవహారం మరింత సంచలనంగా మారింది. ఈ భూమిలో ఎలాంటి అసైన్‌మెంట్ జరగలేదని స్థానికులు చెబుతున్నప్పటికీ.. రీ-సర్వేలో ఎంట్రీలు సృష్టించి, భూములకు ఎల్పీఎంలు కేటాయించినట్ల



ఆరోపిస్తున్నారు. సుమారు 121.84 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి అక్రమ మార్పులు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీగా నగదు చేతులు మారిందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? రికార్డుల్లో మార్పులు ఎప్పుడు జరిగాయి? ఎవరి ఆదేశాల మేరకు జరిగాయి? ఎల్పీఎంల కేటాయింపునకు ఆధారాలేమిటి? అన్న ప్రశ్నలకు అధికారిక దర్యాప్తులో సమాధానం రావాల్సి ఉంది.

### సర్వే సిబ్బంది పాత్రపై ఆరోపణలు

రీ-సర్వే సమయంలో పనిచేసిన కొందరు సర్వే సిబ్బంది పాత్రపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో భాకరాపేటలో పనిచేసిన విలేజ్ సర్వేయర్ తూపల్లి చంద్రశేఖర్, దిగవూరు విలేజ్ సర్వేయర్ హేమంత్, మండల సర్వేయర్ కలవగుంట గణేష్ వ్యవహారశైలిపై ఆరోపణలు చేస్తున్నప్పటికీ.. వీటిని సంబంధిత అధికారులు విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

రీ-సర్వేలో సిబ్బంది స్థాయిలోనే మార్పులు జరిగాయా? లేక మండలస్థాయిలో ఉన్నతాధికారుల అనుమతులతోనే రికార్డులు మార్చారా? అన్న అంశాన్ని తేల్చాలని బాధితులు కోరుతున్నారు.

### హైకోర్టు ఆదేశాల అమలుపైనా ప్రశ్నలు

ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఆదేశించిన వ్యవహారాల్లోనూ ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానంలో కేసులు దాఖలైనప్పటికీ అవసరమైన సూచనలు, కౌంటర్లు సమర్పించడంలో నిర్లక్ష్యం జరిగిందని పేర్కొంటున్నారు.

ఇలాంటి ఆరోపణల నేపథ్యంలో సంబంధిత కోర్టు కేసులన్నింటినీ సమీక్షించి, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, వాటి అమలు స్థితి, అనంతరం జరిగిన రికార్డు మార్పులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

### 'డబ్బులు ఇస్తే రికార్డులు మారుతున్నాయి'

రీ-సర్వే పేరుతో కొందరు అధికారులు, సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. డబ్బులు ఇచ్చిన వారికి అనుకూలంగా రికార్డులు మార్చి, ఇతరుల హక్కులకు భంగం కలిగించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించి నగదు లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, రికార్డు మార్పులకు సంబంధించిన డిజిటల్ లాగ్‌లు, అధికారిక ఉత్తర్వులు వంటి అంశాలను దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సి ఉంది.

### రీ-సర్వే రద్దు చేయాలని డిమాండ్

భాకరాపేట, దిగవూరు ప్రాంతాల్లో జరిగిన రీ-సర్వేను పూర్తిగా సమీక్షించి, అవకతవకలు నిర్ధారణ అయితే ఆ ప్రక్రియను రద్దు చేసి మళ్లీ స్వతంత్రంగా రీ-సర్వే నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు.

పాత రికార్డులు--కొత్త రికార్డులు, ఎల్పీఎంలు, అసైన్‌మెంట్ ఉత్తర్వులు, మ్యుటేషన్లు, సబ్ డివిజన్ వివరాలు, కోర్టు ఆదేశాలను ఒకే వేదికపై పరిశీలించేలా ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి భూమికి సంబంధించిన రికార్డు మార్పులకు ఎవరు ఆమోదం ఇచ్చారు? ఏ ఆధారంతో ఎల్పీఎం కేటాయించారు? అన్నది బహిర్గతం చేయాలని కోరుతున్నారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రీ-సర్వేలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. తమకు న్యాయం జరగకపోతే లోకాయుక్త, విజిలెన్స్, ఏసీబీ తదితర సంస్థలను ఆశ్రయిస్తామని స్పష్టం చేస్తున్నారు. రీ-సర్వే లక్ష్యం రైతుల భూహక్కులకు రక్షణ కల్పించడమే తప్ప.. కొత్త వివాదాలకు తావివ్వడం కాదని వారు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్థాయిలో ప్రత్యేక విచారణ చేపట్టి, భాకరాపేట, దిగవూరు రీ-సర్వే రికార్డులను పూర్తిగా పరిశీలించి నిజానిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల వివరణ అవసరం

ఈ వ్యవహారంలో బాధితులు, స్థానికులు చేస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో.. సంబంధిత రెవెన్యూ అధికారులు, తహశీల్దార్, సర్వే విభాగం అధికారులు తమ వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు వాస్తవమా? రీ-సర్వే నిబంధనల ప్రకారమే జరిగిందా? ఎల్పీఎంల కేటాయింపునకు ప్రామాణిక ఆధారాలున్నాయా? అన్న అంశాలపై అధికారిక ప్రకటన వెలువడితేనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

# వెంగళాయపాలెంలో 'కరెంట్' దందా.?

## పైసలు ఇస్తే చాలు కనెక్షన్.?

- తీగ తెగినా టేపుతో ముడి, తడి నేలపైనే వదిలేసిన వైనం ఇల్లు లేకపోయినా మీటర్
- పోల్ పరిధి దాటి సర్వీస్ వైర్లు.. నిబంధనలు గాలికి
- ప్రమాదాలు జరిగినా పట్టని వైనం,క్షేత్రస్థాయి సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు
- ఒకే గ్రామంలో ఏళ్ల తరబడి పాతుకుపోయారా.?

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ.?**

గుంటూరు రూరల్(ప్రశ్న న్యూస్) ప్రజల ఇళ్లకు వెలుగులు అందించాల్సిన విద్యుత్ శాఖలో నిబంధనలు చీకట్లో కలిసిపోతున్నాయా.? వెంగళాయపాలెం గ్రామంలో విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు, వైరింగ్, మీటర్ల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వర్షానికి, గాలికి సర్వీస్ వైర్లు తెగిపడినా.. వాటిని సురక్షితంగా తొలగించకుండా తడి నేలపైనే టేపులతో చుట్టి వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగల్లో సరఫరా కొనసాగితే క్షణాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నప్పటికీ ఇలాంటి నిర్లక్ష్యం ఎందుకన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదకరమైన వైర్లను తొలగించి శాశ్వత మరమ్మతులు చేయాల్సిన సిబ్బంది తాత్కాలికంగా టేపులు చుట్టి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### 'పైసలిస్తే మీటర్ ఖాయం

ఇళ్లు లేని ఖాళీ స్థలాలకు కూడా విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. స్థలంలో నివాసం ఉందా.? నిర్మాణం ఉందా.? విద్యుత్ కనెక్షన్‌కు అవసరమైన నిబంధనలు పాటించారా.? అన్నది పట్టించుకోకుండా డబ్బులు చెల్లిస్తే మీటర్ మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అర్హత, పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన కంటే క్షేత్రస్థాయి సిబ్బందిని 'సంతృప్తిపరచడమే' ముఖ్యమైందన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల మంజూరైన కనెక్షన్లను ఉన్నతాధికారులు రికార్డుల ఆధారంగా తనిఖీ చేస్తే ఆరోపణల్లో వాస్తవమెంతో తేలుతుందని గ్రామస్థులు అంటున్నారు.



### పోల్ నుంచి ఎంత దూరమైనా.. వైరు లాగేస్తారా.?

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాల నుంచి పరిధికి మించి సర్వీస్ వైర్లు లాగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వైర్లు వేలాడటం, గాలికి ఊగడం, తెగిపడటం వంటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.

విద్యుత్ భద్రతా నిబంధనలు ఎవరికి?

కనెక్షన్ ఇచ్చే ముందు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోందా.?

### సర్వీస్ వైర్ల పొడవు, మార్గాన్ని ఎవరు తనిఖీ చేస్తున్నారు.?

అన్న ప్రశ్నలకు విద్యుత్ శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలోనూ షార్ట్‌సర్క్యూట్.. అయినా గుణపాఠం లేదా? గ్రామంలో గతంలో లూజ్ వైరింగ్ కారణంగా అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇళ్లు దెబ్బతిన్న ఘటన చోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో బాధితులకు డబ్బులు ఇచ్చి విషయం బయటకు రాకుండా రాజీ చేసుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక ధ్రువీకరణ అవసరం. ఒకవేళ ఇలాంటి ఘటనలు నిజమైతే.. ప్రమాదానికి కారణమైన వైరింగ్‌ను సరిచేయకుండా, బాధితులతో రాజీ పడటం సమస్యకు పరిష్కారం కాదని ప్రజలు అంటున్నారు. మరో ప్రమాదం జరగకముందే గ్రామంలోని విద్యుత్ వ్యవస్థపై ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహించాలని కోరుతున్నారు.

### 'స్థానికుడి' హవా.?




క్షేత్రస్థాయి సిబ్బందిలో ఒకరు అదే గ్రామానికి చెందినవారే కావడంతో స్థానిక సంబంధాల ప్రభావంతో నిబంధనల అమలులో రాజీ పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకే ప్రాంతంలో దీర్ఘకాలం విధులు నిర్వహించడం వల్ల పర్యవేక్షణ బలహీనపడిందని గ్రామస్థులు అంటున్నారు.

అయితే ఇవి ఆరోపణలు మాత్రమేనని, వాస్తవ పరిస్థితులను శాఖాపరమైన విచారణలో నిర్ధారించాల్సి ఉంది.

### ఉన్నతాధికారుల 'సైలెన్స్' ఎందుకు?

విద్యుత్ కనెక్షన్లు, సర్వీస్ వైర్లు, లూజ్ వైరింగ్‌పై ఇన్ని ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో మంజూరైన మీటర్లను పరిశీలించి.. ఖాళీ స్థలాలకు ఇచ్చిన కనెక్షన్లు, నిబంధనలకు విరుద్ధంగా లాగిన సర్వీస్ వైర్లు, ప్రమాదకర వైరింగ్ ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజల ప్రాణాలతో ముడిపడిన విద్యుత్ భద్రత విషయంలో నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు వాస్తవమా? లేక నిరాధారమా? అన్నది తేల్చేందుకు ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించాలని కోరుతున్నారు. వెంగళాయపాలెంలో 'కరెంట్ దందా' ఆరోపణలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తారా? ప్రమాదకర వైరింగ్‌ను తొలగించి ప్రజలకు భద్రత కల్పిస్తారా? నిబంధనలకు విరుద్ధంగా కనెక్షన్లు ఇచ్చినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# రోడ్డు వేశారు.. మ్యాన్ హోల్స్ కవర్లు వదిలేశారు

**- 60 మ్యాన్‌హోల్ కవర్లు పెండింగ్‌లోనే ప్రజల ప్రాణాలతో చెలగాటం- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆగ్రహం**

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ సర్కిల్ రామంతపూర్ డివిజన్ లో రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కృష్ణ హోటల్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కోటి రూపాయల రోడ్డు సమస్యలు మాత్రం అలాగే హాస్పిటల్ నుంచి ఓల్డ్ రామంతపూర్ వరకు సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన డాంబర్ రోడ్డుపై మ్యాన్‌హోల్ కవర్లను రోడ్డు స్థాయికి సమంగా ఏర్పాటు చేయకుండా వదిలేశారని సంస్థ ప్రతినిధులు ఆరోపించారు. సుమారు 60 మ్యాన్‌హోల్ కవర్ల పనులు పెండింగ్‌లో ఉండటంతో రహదారి గుంతలమయంగా మారిందని తెలిపారు.మ్యాన్‌హోల్ కవర్లు, రోడ్డు గుంతల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలు అధికారులకు కనిపించడం లేదా?ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ తెలిపారు.

**రోడ్డు నిర్మాణం పూర్తయి సంవత్సరం గడుస్తున్నా మ్యాన్ హో ల్ కవర్ల సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదు.?**



**ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదు.?**

ఈ సమస్యను ఎవరు పరిష్కరిస్తారు అని ఆయన ప్రశ్నించారు.తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మ్యాన్ హోల్ కవర్లను రోడ్డు స్థాయికి సమంగా ఏర్పాటు చేయడంతో పాటు, రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ డిమాండ్ చేసింది.
ఈ కార్యక్రమంలో ఆర్‌పీ రఘు ప్రకాష్, తెడ్డు రవీందర్ రావు, సిద్ధగోని రాజు గౌడ్, ఆటో కుమార్, వినోద్ చారి తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శెట్టిపల్లి మోడల్ టౌన్‌షిప్ డీపీఆర్‌పై రెండోసారి సమీక్ష

**- తుది నివేదికను వేగంగా సిద్ధం చేయాలి**

**- తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి**




తిరుపతి(ప్రశ్న న్యూస్) శెట్టిపల్లి మోడల్ టౌన్‌షిప్ ప్రాథమిక డీపీఆర్‌పై తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్‌రెడ్డి రెండో విడత సమీక్ష నిర్వహించారు. తుడా కార్యాలయంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎన్‌సీపీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. తొలి విడత సమావేశంలో చేసిన సూచనల అమలు పురోగతిని సమీక్షించడంతోపాటు.. డీపీఆర్‌లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై చర్చించారు.ప్రాజెక్టు కన్సల్టెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్‌సీపీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సుభానితో డాలర్స్ దివాకర్‌రెడ్డి డీపీఆర్ అంశాలను సమగ్రంగా సమీక్షించారు. భూ వినియోగ ప్రణాళిక, మౌలిక వసతుల లేఅవుట్, రోడ్ల నెట్‌వర్క్, తాగునీరు, డ్రైనేజీ, ప్రజా వినియోగ స్థలాల కేటాయింపుపై ఇప్పటివరకు జరిగిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు.భవిష్యత్ నగరీకరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టౌన్‌షిప్ ప్రణాళిక ఉండాలని చైర్మన్ సూచించారు. అంతర్గత రహదారులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించడంతోపాటు.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుదీకరణ, నిరంతర నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.పర్యావరణహిత టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దేందుకు పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, క్రీడా మైదానాలు, కమ్యూనిటీ హాళ్లకు తగిన స్థలం కేటాయించాలని సూచించారు. నివాస ప్రాంతాలతోపాటు ఆధునిక వాణిజ్య సముదాయాలు, విద్యా, వైద్య సదుపాయాలకు స్పష్టమైన జోనింగ్ ఉండాలని తెలిపారు.తిరుపతి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేలా శెట్టిపల్లి మోడల్ టౌన్‌షిప్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించాలని డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తొలి సమావేశంలో సూచించిన అంశాలతోపాటు.. తాజా సూచనలను పొందుపరుస్తూ సమగ్ర తుది డీపీఆర్‌ను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసి అందించాలని ఎన్‌సీపీఏ ఎండీ సుభానిని ఆదేశించారు. సమావేశంలో తుడా కార్యదర్శి డాక్టర్ ఎన్.వి. శ్రీకాంత్‌బాబు, ఎస్ఈ రవీంద్రయ్య, డీఈ నరేష్‌బాబు, ఏఈ నితిన్, ఎన్‌సీపీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం.. పట్టాలు తప్పిన మహానంద ఎక్స్‌ప్రెస్

పాట్నా: సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వల్ల మహానంద ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, రెండు బోగీలు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సంఘటన వల్ల ఆ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 15483 అలీపుర్దువార్ జంక్షన్–ఢిల్లీ సిక్కిం మహానంద ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 4.12 గంటలకు బీహార్‌లోని ఆరా రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ రెండుకు చేరుకున్నది.కాగా, ఢిల్లీ వెళ్లాల్సిన ఆ రైలు స్టేషన్ నుంచి బయలుదేరిన సమయంలో సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో ససారం అప్ లైన్ వైపు సిగ్నల్ చూపించడంతో ఆ రైలు ముందుకు కదిలింది. అయితే స్టేషన్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో అది పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, ఎస్ఎల్ఆర్, హెచ్–1 కోచ్ చక్రాలు పట్టాలు తప్పాయి. ఈ సంఘటన వల్ల ఆ మార్గంలో రైళ్ల రాకపోకలతకు అంతరాయం ఏర్పడింది.మరోవైపు ఈ సమాచారం తెలిసిన వెంటనే రైల్వే అధికారులు, సాంకేతిక బృందాలు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టాలు తప్పిన రైలు ఇంజిన్, బోగీలను ట్రాక్‌పైకి ఎక్కించే పునరుద్ధరణ పనులు చేపట్టారు.ససారం లైన్ వైపు సిగ్నల్ మళ్లడానికి దారితీసిన పరిస్థితులు, ఆ రైలు తప్పుడు దిశలో ఎలా ప్రయాణించిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు.

# బీఆర్ఎస్ శ్రేణుల జోలికొస్తే ఊరుకోం.. పోలీసులకు మాజీ మంత్రి పువ్వాడ హెచ్చరిక

జూలూరుపాడు : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో విధులు నిర్వహించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు పోలీసులు హింసను ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.భవిష్యత్తులో రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రస్తుతం అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, తప్పుడు చర్యలకు పాల్పడుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తప్పుడు పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సరైన విధులు నిర్వహించి తగిన రీతిలో పనిచేయాలని పోలీసులకు హితవు పలికారు.

# ఈ అలవాట్లు ఉంటే పాతిక ఏళ్లకే వృద్ధాప్యం..

కొంత మంది పాతికేళ్లకే నలభై ఏళ్ల మాదిరి కనిపిస్తుంటారు. ముఖ్యంగా అబ్బాయిల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నిజానికి.. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. అంతేకాదు వృద్ధాప్యానికి కూడా ఈ అలవాట్లే కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యానికి కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఏమి తింటారు అనే దాని నుంచి స్ట్రెస్‌ని ఎలా ఎదుర్కొంటారు అనే దాని వరకు.. అన్ని అంశాలు మీ వయస్సు ఎంత వేగంగా క్షీణిస్తుందో నిర్ణయించగలవట. అలాగే ఈ అలవాట్లు దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు.ధూమపానం: వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేసే విషయంలో ధూమపానం అత్యంత హానికరమైన అలవాట్లలో ఒకటి. ఇది చర్మం స్థితిస్థాపకతను దెబ్బతీస్తుంది. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ముడతలు, నిస్తేజమైన చర్మానికి దారితీస్తుంది. ఇది కాలేయంతో సహా మొత్తం శరీర ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది.మద్యం సేవించడం: అధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయి. మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. వాపుకు కారణమవుతుంది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలక్రమేణా కాలేయ పనితీరు దెబ్బతింటుంది. అధిక వేడి: విటమిన్ డి కోసం సూర్యరశ్మి చాలా అవసరం. అయినప్పటికీ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మిని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చర్మం వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. సన్ స్క్రీన్ ఉపయోగించకపోతే, చర్మాన్ని సూర్య రశ్మి నుంచి కాపాడుకోవడానికి రక్షణ దుస్తులు ధరించకపోతే సూర్యరశ్మి వల్ల మచ్చలు, సన్నని గీతలు, ముడతలు చర్మంపై ఏర్పడి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి.దీర్ఘకాలిక నిర్జలీకరణం: సరైన హైడ్రేషన్.. అంటే తగినంత నీరు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల చర్మం పొడిబారి, పొలుసులుగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది.ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర తీసుకోవడం: చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు జీవక్రియను ప్రభావితం చేయడమే కాకుండా చర్మ సమస్యలు, వాపుకు కూడా కారణమవుతాయి.
ఇది చర్మం జీవం కోల్పోవడం, ముడతలు వంటి వృద్ధాప్య అకాల సంకేతాలకు దారితీస్తుంది. ఒత్తిడి: వృద్ధాప్యానికి ఒత్తిడి ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రను ప్రభావితం చేస్తుంది.

# స్థానిక ఎన్నికల్లో నీతి, నిజాయతీతో పనిచేయాలి

**కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలి: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

బుచ్చిరెడ్డిపాళెం(ప్రశ్న న్యూస్) స్థానిక ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ నీతి, నిజాయతీతో ప్రజలను కలవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆదివారం కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వార్డుల వారీగా పార్టీ బలోపేతం, అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహం, ప్రజలతో మమేకం కావడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంపై దిశానిర్దేశం చేశారు.

### అందరూ కలిసి పనిచేయాలి

బుచ్చిరెడ్డిపాళెంలో 28 వార్డులు ఏర్పాటు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. రిజర్వేషన్ల ప్రకారం ఏ వార్డులో ఎవరు అభ్యర్థిగా నిలిచినా మిగిలిన నాయకులు, కార్యకర్తలు వారికి సహకరించాలని కోరారు. కౌన్సిలర్ అవకాశం రాని వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు సేవ చేసే ప్రతి ఒక్కరూ నాయకులేనని చెప్పారు. అసంతృప్తులు ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడాలని సూచించారు.ప్రజల నమ్మకమే తమ బలమని, అభివృద్ధే తమ అజెండా అని పేర్కొన్నారు. రాజకీయాల్లో అసత్యాలు, అబద్ధాలకు తావులేదని.. నీతి, నిజాయతీతో ముందుకు సాగుతామని అన్నారు. అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలకు ప్రతిస్పందిస్తూ సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలకు సేవ చేయడంపైనే దృష్టి పెట్టాలని నాయకులకు సూచించారు.

### మూడేళ్లలో మరింత అభివృద్ధి

కోవూరు నియోజకవర్గంలో గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గమనించారని ప్రశాంతిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిధులతోపాటు సొంత నిధులు, దాతల సహకారంతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో మరింత కష్టపడి పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణం, వంతెనల పనులు చేపట్టామని తెలిపారు. మంత్రి నారాయణ కేటాయించిన నిధులతో రూ.16 కోట్ల రోడ్డు పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. మరో రూ.5 కోట్లతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. మల్దేవి వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందరూ ఐక్యంగా పనిచేస్తే బుచ్చిరెడ్డిపాళెంలో కూటమి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



### టీడీపీలోకి వైసీపీ నాయకులు

సమావేశం సందర్భంగా వైసీపీ నాయకుడు అల్లం శ్రీనయ్యతోపాటు ఆయన అనుచరులు మరో పది మంది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, ఎమ్మెల్యే పనితీరుపై నమ్మకంతో టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.

# ఉప్పాడ తీర రక్షణ గోడకు కదలిక

**డీపీఆర్ రూపకల్పనకు ఐఐటీ-మద్రాస్ సర్వే.. డ్రోన్లతో తీర ప్రాంత మ్యాపింగ్**

ఉప్పాడ(ప్రశ్న న్యూస్) దశాబ్దాలుగా సముద్ర కోతతో సతమతమవుతున్న ఉప్పాడ తీర ప్రాంత ప్రజలకు ఊరట కలిగించే దిశగా రక్షణ గోడ నిర్మాణానికి కీలక అడుగు పడింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక పర్యవేక్షణలో రక్షణ గోడ డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు ఐఐటీ--మద్రాస్ నిపుణుల బృందం క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించింది. ఐదుగురు సభ్యుల బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర ప్రాంతం వెంబడి అధ్యయనం చేస్తోంది.





### డ్రోన్లతో సర్వే

తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో అనుభవం ఉన్న ఐఐటీ--మద్రాస్ నిపుణులు వారం రోజులుగా ఉప్పాడ తీరంలో వివిధ అంశాలను పరిశీలిస్తున్నారు. అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంత మ్యాపింగ్‌కు ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర భౌగోళిక పరిస్థితులు, అలల ప్రభావం, సముద్ర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలను అధ్యయనం చేస్తున్నారు. నీటి అడుగు భాగం నుంచి బీచ్ వరకు ఇసుక కణాలు, తీర ప్రాంతంలోని ఇసుక, మట్టి అవశేషాల నమూనాలను సేకరించి శాస్త్రీయ పరీక్షలు చేస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటిలో వస్తున్న మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపైనా అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

### అలైన్‌మెంట్‌పై కసరత్తు

సర్వే నివేదిక ఆధారంగా ప్రతిపాదిత రక్షణ గోడకు అనువైన అలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. భవిష్యత్తులో సముద్ర కోతను సమర్థంగా, దీర్ఘకాలికంగా ఎదుర్కొనేలా రక్షణ గోడ డిజైన్ రూపొందించేందుకు ఈ అధ్యయనం కీలకం కానుంది. ఐఐటీ--మద్రాస్ నివేదిక ఆధారంగా డిజైన్, డీపీఆర్‌లో సాంకేతిక అంశాలను పొందుపరచనున్నారు.

### రూ.323 కోట్లతో రక్షణ గోడ

ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్ర కోత సమస్య దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్రంలో కలిసిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. అనేక కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. రైతులు పంట భూములను కోల్పోయారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్, గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలకు ఆమోదం లభించింది.రూ.323 కోట్ల నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో రక్షణ గోడ నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు. డిజైన్, డీపీఆర్ పనులతోపాటు పర్యావరణ, ఇతర అవసరమైన అనుమతుల ప్రక్రియను సమాంతరంగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డీపీఆర్ సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఠాపురం పర్యటన సందర్భంగా ఐఐటీ–మద్రాస్ నిపుణులతో డిజైన్, డీపీఆర్‌పై ఆయన చర్చించనున్నారు.

# తండ్రికి 'బై బై' చెప్పి..

## వంతెన పైనుంచి నదిలోకి దూకిన యువతి





శ్రీనగర్: ఒక యువతి బ్రిడ్జి రైలింగ్ అంచువద్దకు చేరుకున్నది. తన జీవితాన్ని ముగించుకుంటున్నట్లు అక్కడున్న వారితో చెప్పింది. చివరగా ఫోన్‌లో తండ్రికి 'బై బై' చెప్పింది. ఆ తర్వాత వంతెన రైలింగ్ వెనుక నుంచి నదిలోకి దూకింది. ఇది చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు. ఆ యువతి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పాయల్ దేవి అనే యువతి ఆదివారం ఒక జాతరకు వెళ్లింది. తన గ్రామానికి చెందిన తెలిసిన వ్యక్తి బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమైంది.కాగా, పాయల్ దేవి దుప్పట్టా బైక్ వీల్‌లో చిక్కుకున్నది. దీంతో ఆ దుపట్టాను తొలగించేందుకు ఆ వ్యక్తి బైక్ ఆపాడు. ఆ సమయంలో ప్రేమ్ నగర్ వంతెన అంచు వద్దకు పాయల్ వెళ్లింది. రైలింగ్ వెనుక వైపు ఆమె నిల్చున్నది. తన జీవితాన్ని ముగించుకోబోతున్నట్లు అక్కడున్న వారికి చెప్పింది. అయితే ఆ ప్రయత్నాన్ని విరమించాలని ఆమెకు నచ్చజెప్పేందుకు వారు ప్రయత్నించారు.మరోవైపు పాయల్‌తో పాటు ఉన్న వ్యక్తి ఆమె తండ్రికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పాడు. దూరం నుంచి ఫోన్‌లో తండ్రితో మాట్లాడిన ఆమె ఇది తన జీవితమని, ముగించుకోవాలని తాను నిర్ణయించుకున్నట్లు చెప్పింది. చివరిగా 'బై బై పాపా' అని అన్నది. ఆ తర్వాత వంతెన రైలింగ్ వెనుక అంచు నుంచి ప్రవహిస్తున్న చీనాబ్ నదిలోకి ఆమె దూకింది. ఇది చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు.ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. నదిలోకి దూకిన ఆ యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇప్పటి వరకు ఆమె మృతదేహం లభించలేదని పోలీస్ అధికారి తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కొందరు వ్యక్తులు వారి మొబైల్ ఫోన్స్‌లో రికార్డ్ చేసిన ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# మైనార్టీల సంక్షేమమే నా లక్ష్యం: గౌస్ భాయ్

**మైనార్టీల సమస్యలపై ముందుండి పోరాడతా: గౌస్ భాయ్**

**దమ్మైగూడ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించిన అహ్మద్‌గూడ మైనార్టీ సోదరులు**



కీసర( ప్రశ్న న్యూస్) 4వ డివిజన్ దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు గౌస్ భాయ్‌ను అహ్మద్‌గూడకు చెందిన మైనార్టీ సోదరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మైనార్టీ ప్రజలు, ముఖ్యంగా ముస్లిం సోదర సోదరీమణులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడాలని వారు గౌస్ భాయ్‌ను కోరారు.మైనార్టీ సోదరుల విజ్ఞప్తికి గౌస్ భాయ్ సానుకూలంగా స్పందిస్తూ, తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మైనార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మైనార్టీ సోదరులకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారం కోసం తాను ముందుండి పోరాడతానని హామీ ఇచ్చారు.అలాగే మైనార్టీ సోదర సోదరీమణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గౌస్ భాయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్‌గూడకు చెందిన పలువురు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ సమితి రామంతపూర్ డివిజన్ కన్వీనర్‌గా వార్ల బాల్ రాజ్ యాదవ్

**వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో**

**గణేష్ ఉత్సవాల నిర్వహణకు కృషి చేస్తాం**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్ )భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రామంతపూర్ డివిజన్ కన్వీనర్‌గా వార్ల బాల్ రాజ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సమితి పెద్దలు, నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.రామంతపూర్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు తిండేరు హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు రమేష్, చింతకింది ప్రవీణ్ తదితరులు నూతన బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందించారు.డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో, వైభవంగా నిర్వహించేందుకు సమితి నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రుద్ర శేఖర్, మాలకొండ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్త, రామేశ్వరరావు, ఓబుల్ రెడ్డి, చింతకింది ప్రవీణ్, చెల్లోజు ఎల్లాచారి, రాపోలు సాయినాథ్, కొండేరు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాపార్క్‌లో కాంగ్రెస్ ధర్నా

**కెసిఆర్ రాజీనామాకు డిమాండ్**

**ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ నినాదాలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇందిరాపార్క్ వేదికగా నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా రాజకీయంగా వేడెక్కించింది. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కెసిఆర్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆరోపణలు చేస్తూ రాజకీయాలు చేయడం కాకుండా, ప్రజల ముందు బాధ్యత వహించాలని మండిపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశాయి. ధర్నాలో పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ ఆర్టీఏ సభ్యుడు సురేష్ లాల్ నేతికర్ మాట్లాడుతూ కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పటినుండి ప్రజలకు ఎలాంటి సేవ చేయలేదని ఫామ్ హౌస్ లో కూర్చుని ప్రజల సొమ్మును జీతాల అలవెన్స్ రూపంలో తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాలని, ప్రజలకు వెయ్యి రోజుల నుండి ఎలాంటి సేవ చేయని కెసిఆర్ ఎమ్మెల్యే పదవిలో ఉండే అర్హత లేదని వెంటనే రాజీనామా చేయాలని సురేష్ లాల్ పేర్కొన్నారు. పదవులకు కట్టుబడి ఉండటం కంటే ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడమే ముఖ్యమన్నారు. ధర్నాతో ఇందిరాపార్క్ పరిసరాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

# కరిమారమ్మ పూజలో తెలుగుదేశం నాయకుడు



శ్రీ కాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలోని బహుదూర్ పేట నందు వెలసి ఉన్న కరిమరీఏమ్మఅమ్మవారి 12వ వార్షికోత్సవం పురస్కరించుకొని వందమంది దంపతులతో దంపత హోమం ,కుంకుమార్చన నిర్వహించారు ,సుబ్బయ్య దంపతులు కుటుంబ కుటుంబ సమేతంగా హోమం నిర్వహించగా, ఈ కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు కలశాలను దగ్గర ఉంచుకొని కుంకుమార్చన చేసుకున్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చందన స్రవంతి పాల్గొన్నారు, వీరిని సుబ్బయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక స్వామి అమ్మవారీ దర్శన ఏర్పాట్లు నిర్వహించి శాలువాలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, సుబ్బయ్య మాట్లాడుతూప్రతి ఏటలాగనే ఈ సంవత్సరం తమ గ్రామంలో వెలసి ఉన్న కరిమారి అమ్మకు 12వ వార్షికోత్సవం అత్యంత వేడుకగా నిర్వహించామని తెలియజేశారు, ఈ అమ్మవారి కృప వల్ల తమ గ్రామంతో పాటు రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండి సుభిక్షంగా ఉండాలని ,అమ్మవారి కృప కూటమి ప్రభుత్వానికి ఉండి రానున్న పంచాయతీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించాలని అమ్మవారిని కోరుకున్నామనిఈ సందర్భంగా తెలియజేశారు.

# కేసీఆర్ దిష్టిబొమ్మ దహనంపై కేసు నమోదు చేయాలి

**వంటేరు ప్రతాప్‌రెడ్డి**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, నర్సారెడ్డి అనుచరులపై వెంటనే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనను అవమానించిన వారిపై ప్రజాస్వామ్యబద్ధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సాధారణంగా అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధి చేయకపోతే, సంక్షేమ పథకాలు అమలు చేయకపోతే, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రతిపక్షాలు అధికార పార్టీ నేతల రాజీనామాలను డిమాండ్ చేస్తాయని అన్నారు. అయితే అందుకు భిన్నంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష నేత కేసీఆర్ రాజీనామా చేయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం, గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో విఫలమైన కాంగ్రెస్ నాయకులు ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అధికార పక్ష నాయకులు ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రుల చేతకానితనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ జెడ్పీటీసీ పంగా మల్లేశం, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం మిత్ర బృందం ఆర్థిక సాయం

**నిరుపేద కుటుంబానికి రూ.20 వేల నగదు అందజేత**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )ఆపన్న హస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో 130వ సహాయ కార్యక్రమాన్ని ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వద్దేపల్లి గ్రామానికి చెందిన మునిగంజి రాజేష్ కుమార్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయంతో పాటు దూర ప్రాంతం నుంచి రాకపోకల ఖర్చుల నిమిత్తం మరో రూ.1,800 అందజేశారు.మునిగంజి రాజేష్ కుమార్‌కు సాహిత్యంపై ఎంతో ఆసక్తి ఉండేదని, చక్కగా కవిత్వం రాసేవారని బృందం సభ్యులు తెలిపారు. 2008లోనే ఆయన రచించిన రెండు పుస్తకాలు ముద్రించగా, గజ్వేల్ పట్టణంలో డాక్టర్ పెంటాచారి సమక్షంలో వాటిని ఆవిష్కరించినట్లు గుర్తుచేశారు.అనంతరం కుటుంబ సమస్యల కారణంగా రాజేష్ కుమార్ మరో ప్రాంతానికి వెళ్లి అక్కడ పని చేసుకుంటూ జీవనం సాగించేవారని తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనతో ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి దెబ్బతిని, ఎలాంటి పని చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పేద కుటుంబానికి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు.ఈ పరిస్థితిని తెలుసుకున్న ఆపన్న హస్తం మిత్ర బృందం తమ వంతు సహాయంగా రూ.20,000 నగదు, రాకపోకల ఖర్చుల కోసం రూ.1,800 అందించి కుటుంబానికి అండగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ఆపన్న హస్తం మిత్ర బృందం అధ్యక్షులు పాషికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు కొలిచెల్మ స్వామి, సభ్యులు విజయ్ కుమార్, రాణి, కనకరాజు, నర్సింలు, జనార్ధన్ తదితరులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ బృందం లక్ష్యమని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆపన్న హస్తం మిత్ర బృందం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలి అధికారులు మొద్దు నిద్రను వీడాలి



శ్రీ కాళహస్తి(ప్రశ్న న్యూస్)తొట్టంబేడు మండలం, గుండేలి గుంట గ్రామం, వాస్తవ్యులు చంద్రశేఖర్ ను మట్టి మాఫియా ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన కారణంగా చంద్రశేఖర్ పార్దివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు.డి సి సిఅధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మృతుని ఇంటి వద్దకు చేరుకొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, మృతుని కుటుంబానికి ప్రభుత్వం వెనువెంటనే అన్ని రకాలుగా ఆదుకోవాలని అదేవిధంగా నేడు శ్రీకాళహస్తి నియోజకవర్గం లో మట్టి మాఫియా పేట్రేగిపోతోందని, గడిచిన కొంతకాలంలోనే సుమారుగా రెండు మరణాలు సంభవించాయని ఒకరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాగా మరొకరు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఒప్పంద కార్మికుడు కావడం గమనార్హం అని,మృతుని పార్థివ దేహం వద్ద నుంచే సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా ఐజజ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడి వారి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేకూర్చాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రమైనటువంటి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఇంత ఘోరమైన సంఘటనలు జరుగుతున్న సంబంధిత అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదని, వారు నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త డి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ,అరుణ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మయూరి నగర్‌లో హైడ్రాకు మద్దతుగా మహా ర్యాలీ

**చెరువులను కాపాడాలి..**

**పర్యావరణాన్ని సంరక్షించాలి అంటూ నినాదాలు**




హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ) హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేపడుతున్న చర్యలకు మద్దతుగా మయూరి నగర్ కాలనీ వాసులు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. మయూరి నగర్ ప్లే గ్రౌండ్ నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మయూరి నగర్‌తో పాటు చుట్టుపక్కల కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారు చెరువులను కాపాడాలి.. పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి.. భూగర్భ జలాలను పెంచుకోవాలి.. హైదరాబాద్ వాసుల దాహార్తిని తీర్చాలి అంటూ నినాదాలు చేశారు. చెరువులు, నీటి వనరుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కాలనీ వాసులు తెలిపారు.కార్యక్రమంలో మయూరి నగర్ కాలనీ అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి కిషోర్ కుమార్, రామిరెడ్డి, నాగార్జున, ప్రముఖ సంఘ సేవకులు మూర్తి, ఆధ్యాత్మికవేత్త పాత్రో, ప్రముఖ పర్యావరణవేత్త నాదెళ్ల ప్రేమ్, జేఎన్టీయూ విశ్రాంత ఉద్యోగి గరికపాటి బాపూజీ, ప్రముఖ షటిల్ స్పోర్ట్స్ క్రీడాకారుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గురుపూజోత్సవంలో ఉపాధ్యాయుల సేవలను కొనియాడిన ఎంపీ రఘునందన్ రావు




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని కేఎంఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్కర్ పద్మాబాయి నర్సింగ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ మాట్లాడుతూ, తాను కూడా గతంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్నందున ఉపాధ్యాయ వృత్తిలోని బాధ్యతలు, కష్టాలు, సవాళ్లు తనకు ప్రత్యక్షంగా తెలుసన్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడం, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం, వారి సమస్యలను అర్థం చేసుకుని సరైన మార్గంలో నడిపించడం ఉపాధ్యాయులపై ఉన్న గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు.తాను విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఎదుర్కొన్న ఇబ్బందులు, ఆ సమయంలో ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విద్యార్థిగా, ఉపాధ్యాయురాలిగా తన అనుభవాలను వివరిస్తూ ఉపాధ్యాయుల కష్టం, బాధ్యత ఎంత గొప్పదో వివరించారు."ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించే పాఠం ఒక విద్యార్థి జీవితాన్ని మార్చగలదు. ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత సమస్యలను పక్కనపెట్టి విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తారు. వారి సేవలకు ఎంత గౌరవం ఇచ్చినా తక్కువే" అని చందన రవీందర్ అన్నారు.అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారికి గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రొట్టెల శ్రీనివాస్, తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు, వివిధ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పలాస అభివృద్ధికి కూటమి నేతల సమన్వయం



పలాస(ప్రశ్న న్యూస్) పలాస నియోజకవర్గ అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఆయన ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సమావేశంలో చర్చించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని నాయకులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు.. అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని పలాసను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని వెంకన్న చౌదరి పిలుపునిచ్చారు.సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# బిగ్‌బాస్ తెలుగు 10కు రంగం సిద్ధం..

## – టైమింగ్స్‌లో భారీ మార్పులు, హౌస్‌లోకి 16 మంది!




తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు 10' గ్రాండ్ లాంచ్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లతో ప్రేక్షకులను అలరించిన ఈ రియాలిటీ షో.. ఇప్పుడు పదో సీజన్‌తో మరింత గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతోంది. ల్యాండ్‌మార్క్ సీజన్ కావడంతో ఈసారి కంటెస్టెంట్లు, టాస్కులు, కాన్సెప్ట్‌తో పాటు ప్రసార సమయాల్లోనూ కీలకమైన మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌కు కూడా కింగ్ నాగార్జున హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకంగా 'దశావతారం' కాన్సెప్ట్‌తో ఈసారి బిగ్‌బాస్ హౌస్‌లో ఎలాంటి ఆటను చూపించబోతున్నారనేది ఆసక్తిగా మారింది. 'బిగ్‌బాస్ తెలుగు 10' గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ సెప్టెంబర్ 6, ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభం కానుంది. సాధారణంగా బిగ్‌బాస్ గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్‌లకు ఉండే భారీ హంగామాతో ఈసారి కూడా కొత్త సీజన్‌ను ప్రారంభించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.స్టార్ మా ఛానల్‌తో పాటు డిస్నీ హాట్‌స్టార్ వేదికగా కూడా ఈ షో అందుబాటులోకి రానుంది. దీంతో టీవీ ప్రేక్షకులతో పాటు ఓటీటీ ఆడియన్స్‌ను కూడా ఒకేసారి ఆకట్టుకునేలా ఈ సీజన్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. గత కొన్ని సీజన్లుగా రాత్రి 10 గంటల సమయంలో బిగ్‌బాస్ డైలీ ఎపిసోడ్లు ప్రసారమవుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈసారి ప్రేక్షకుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని టైమింగ్స్‌లో మార్పులు చేసినట్లు సమాచారం. సోమవారం నుంచి శుక్రవారం వరకు డైలీ ఎపిసోడ్లు రాత్రి 9:30 గంటలకు ప్రసారం కానున్నాయి. ఇక వీకెండ్‌లో నాగార్జున హోస్ట్ చేసే ప్రత్యేక ఎపిసోడ్లు శని, ఆదివారాల్లో రాత్రి 9 గంటలకు టెలికాస్ట్ అవుతాయి.ప్రైమ్ టైమ్‌లోకి షోను తీసుకురావడం వల్ల కుటుంబ ప్రేక్షకులకు మరింత సులభంగా బిగ్‌బాస్‌ను చూసే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.బిగ్‌బాస్ తెలుగు మొదటి సీజన్‌కు ఎన్టీఆర్, రెండో సీజన్‌కు నాని హోస్ట్‌లుగా వ్యవహరించిన సమయంలో షో రాత్రి 9:30 గంటలకు ప్రసారమైంది. ఆ రెండు సీజన్లకు మంచి ఆదరణ లభించింది. మూడో సీజన్ నుంచి నాగార్జున హోస్ట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత షో ప్రసార సమయం రాత్రి 10 గంటలకు మారింది. ఇప్పుడు పదో సీజన్‌లో మరోసారి 9:30 గంటల టైమింగ్‌ను తీసుకురావడంతో పాత బిగ్‌బాస్ అభిమానులకు కూడా ఇది ఆసక్తికరమైన మార్పుగా మారింది. ఈ టైమింగ్ మార్పు షోకు మరింత ఎక్కువ వ్యూయర్‌షిప్, టీఆర్పీ తీసుకొస్తుందా అనేది చూడాలి. మరోవైపు బిగ్‌బాస్ హౌస్‌లోకి మొత్తం 16 మంది కంటెస్టెంట్లు అడుగుపెట్టబోతున్నట్లు సమాచారం. వీరిలో ప్రత్యేకమైన 'అగ్నిపరీక్ష' ప్రక్రియ ద్వారా ఎంపికైన ఆరుగురు సామాన్యులు ఉండగా.. మరో 10 మంది సెలబ్రిటీలు పోటీపడనున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే పలువురు సెలబ్రిటీల పేర్లు సోషల్ మీడియాలో, బిగ్‌బాస్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ముఖేష్ గౌడ, జబర్దస్త్ నరేష్, జబర్దస్త్ రామ్ ప్రసాద్, యాంకర్ వర్షిణి, అదిత్ అరుణ్, యాంకర్ సుధీర్ వంటి పేర్లు వినిపిస్తున్నాయి.

# డిసెంబర్‌లో లెగసీ



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'చిత్రాన్ని డిసెంబర్ 4న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. సాయికిరణ్ రెడ్డి దైదా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కలాహి మీడియా సంస్థ నిర్మిస్తున్నది. ఏక్తా రాథోడ్ కథానాయికగా నటిస్తున్నది. శనివారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం వంటి అంశాల నేపథ్యంలో ఇంటెన్స్ పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత, నిర్మాతలు: యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా.



# ఆ రోజు హ్యాపీగా ఫీలయ్యా!

తమిళ, తెలుగు భాషల్లో హిట్ చిత్రంగా నిలిచిన 'సర్దార్'కు సీక్వెల్‌గా రూపొందిన 'సర్దార్–2' ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. కార్తి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి పీఎస్ మిత్రన్ దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. ఈ సందర్భంగా శనివారం హీరో కార్తి విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ ' దర్శకుడు 'సర్దార్' కథ చెబుతూ..లుంగీ ధరించిన గూఢచారి అని చెప్పినప్పుడు వెంటనే కనెక్ట్ అయ్యాను. తాగే నీళ్లు వ్యాపారం కాకూడదని ఓ గూఢచారి చేసిన పోరాటంతో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సీక్వెల్‌లో చర్చించిన పాయింట్ తొలిభాగం కంటే పదిరెట్లు ప్రభావవంతంగా ఉంటుంది. 'సర్దార్' మళ్లీ ఎందుకు తిరిగొచ్చాడనే గొప్ప ఆలోచనతో దర్శకుడు సీక్వెల్ కథను తీర్చిదిద్దాడు. ఆరంభం నుంచి ముగింపు వరకు అద్భుతమైన యాక్షన్ ఘట్టాలుంటాయి. ఇందులో నేను తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయంలో కనిపిస్తా. ఇద్దరూ కలిసే ప్రయాణం చేస్తారు. రెండు పాత్రలు ఒకేసారి చేయడం సవాలుగా అనిపించింది. 'సర్దార్' రిలీజ్ తర్వాత నేను ఓ చోటుకి షూటింగ్‌కు వెళ్లాను. అప్పుడు ఓ ముగ్గురు విద్యార్థులు నా కారు వెనక వస్తూ 'వాటర్‌బాటిల్ ప్లాంట్స్‌ని మా ఊళ్లోకి రానివ్వం సర్' అంటూ గట్టిగా అరిచారు. ఆ రోజు చాలా హ్యాపీగా ఫీలయ్యాను. సినిమాలోని సందేశం స్కూల్ పిల్లలకు కూడా చేరువకావడం ఆనందంగా అనిపించింది. ప్రస్తుతం తెలుగులో 'హిట్–4' చేస్తున్నా. 'మార్షల్' సినిమా యాభైశాతం చిత్రీకరణ పూర్తిచేసుకుంది' అన్నారు.

# మారెమ్మ అందరికీ నచ్చుతుంది



'ఈ సినిమా రఫ్ కట్ చూశా. వెరీ రూటెడ్ అండ్ రస్టిక్‌గా చాలా బావుంది. నాకు భలే నచ్చింది. తప్పకుండా ఆడియన్స్‌కి కూడా నచ్చుతుంది. మాధవ్ బాగా చేశాడు. ప్రశాంత్ విహారి పాటలు, డీవోపీ వర్క్ బావుంది. డైరెక్టర్ నాగరాజు చాలా బాగా తీశాడు. ఈ సినిమాకు మంచి పేరు, డబ్బులు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అగ్ర కథానాయకుడు రవితేజ అన్నారు. ఆయన సోదరుడు రఘు తనయుడైన మాధవ్ హీరోగా పరిచయం అవుతున్న తెలంగాణ రూరల్ డ్రామా 'మారెమ్మ'. దీపా బాలు కథానాయిక. మంచాల నాగరాజ్ దర్శకుడు. మయూర్‌రెడ్డి బండారు నిర్మాత. ఈ నెల 10న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన రవితేజ పై విధంగా స్పందించారు.

హీరో మాధవ్ మాట్లాడుతూ 'ఒక మనిషికి, దున్నపోతుకీ మధ్య ఉన్న అనుబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన సినిమా ఇది. ఈ ఎమోషన్‌ని మహిషాపురం మారెమ్మతల్లితో బ్లెండ్ చేసి సినిమాను జనరంజకంగా తీశారు దర్శకుడు మంచాల నాగరాజు. పనిచేసినవారంతా ప్రాణం పెట్టారు. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు. ఇంకా దర్శకుడు మంచాల నాగరాజు, కథానాయిక దీపాబాలు, వికాస్ వశిష్ట, తదితర చిత్రబృందంతోపాటు డైరెక్టర్ హసిత్ గోలీ, కుశాల్‌రెడ్డి కూడా మాట్లాడారు.

# తెల్ల కాగితం ఓ స్వచ్ఛమైన ప్రేమకథ



'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. శనివారం టీజర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు బాబీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ 'ఇది మనందరి కథ. పదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివిన ప్రతి ఒక్కరూ కనెక్టయ్యే కథ. 'తెల్లకాయితం' అనేది ఒక స్వచ్ఛమైన ఇన్నోసెంట్ లవ్‌స్టోరీ. తప్పకుండా అందరికి నచ్చుతుంది' అన్నారు.

# ఆ పాత్ర తెగ నచ్చేసింది!



'భరత్ అనే నేను' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ. ఆ సినిమా హిట్ కొట్టడంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్‌ను సొంతం చేసుకున్నది. ఆ తరువాత 'వినయ విధేయ రామ' అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచినా కియారా క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. హిందీలో బిజీగా మారిపోయిన ఈ బ్యూటీ కేజీఎఫ్ ఫేమ్ యశ్‌తో కలిసి 'టాక్సిక్'లో జతకట్టింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి అడుగుపెట్టి సందడి చేస్తున్న సందర్భంగా కియారా పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి... మా కూతురికి వేము ఎలాంటి రూల్స్ పెట్టదలుచుకోలేదు. తను జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. పొరపాట్లు మానవ సహజం. వాటినుంచే నేర్చుకుంటారు కూడా. నా విషయంలోనూ అదే జరిగింది. చివరకు సిద్ధార్థ్ రూపంలో సరైన వ్యక్తి దొరికాడు. టాక్సిక్ షూటింగ్ జరుగుతున్న సమయంలో నేను గర్భవతిని. ఆ విషయం తెలిశాక మూవీ టీం మొత్తం నన్ను ఎంతో బాగా చూసుకున్నారు. హీరో యశ్ ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ సెట్‌లో నాకొక బాడీగార్డ్, బౌన్సర్‌లా మారిపోయాడు. వాళ్లందరి సహకారంతోనే నా పాత్రకు న్యాయం చేశాను. నేను 'ఎంఎస్ ధోనీ' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యానని చాలామంది భావిస్తారు. కానీ, నా మొదటి సినిమా 'ఫుగ్లీ' బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసింది. దాంతో నా కెరీర్‌లో పెద్ద గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో కొత్త అవకాశాల కోసం మళ్లీ మొదటినుంచి ఆడిషన్లు ఇవ్వడం మొదలు పెట్టాను. అందులో చాలా వరకు రిజెక్ట్ అయ్యాయి కూడా. అయినా కుంగిపోకుండా పట్టుదలతో ముందుకు సాగాను. మాతృత్వం ఒక సంపూర్ణ గుర్తింపును ఇచ్చే మార్పు. అదొక కొత్త ప్రపంచం. గర్భధారణ సమయంలో మనల్ని మనం శాంతపరచుకోవడం చాలా కష్టం. దానికి చాలా సమయం పడుతుంది. నాకు ఆరు నెలలు పట్టింది. ఆ సమయంలో అనవసర భయాలకు దూరంగా ఉండటానికి ప్రయత్నించా. టాక్సిక్ కథ విన్నప్పుడు ఆ పాత్రను తీర్చిదిద్దిన తీరు నన్ను చాలా ఆకట్టుకుంది.

ఓ యాక్టర్ కోరుకునే ప్రతిదీ అందులో ఉంది. నా కెరీర్‌లో ఇలాంటి పాత్రను పోషించగలననే ఆత్మవిశ్వాసం నాకు వచ్చిందనిపించింది. మహిళలను ఒకే మూసలో ఇరికించడం నాకు ఇష్టం ఉండదు. వాళ్ల పాత్రలు బలంగా, వాస్తవికంగా, సంక్లిష్టంగా ఉండాలని కోరుకునే వ్యక్తిని నేను.

# 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్' – మూవీ రివ్యూ!



మలయాళంలో ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్న సినిమా పేరే 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్'. నివిన్ పౌలి – మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమా ఇది. రొమాంటిక్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమా, మలయాళంలో ఆగస్టు 21వ తేదీన విడుదలైంది. తొలి ఆటతోనే హిట్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, 200 కోట్లకి పైగా వసూళ్లతో దూసుకుపోతోంది. అలాంటి ఈ సినిమా, తెలుగు ప్రేక్షకుల ముందుకు ఈ నెల 4వ తేదీన వచ్చింది.జస్టిన్ (నివిన్ పౌలి) తన తల్లిదండ్రులతోను .. తమ్ముడు 'జోయెల్'తోను కలిసి నివసిస్తుంటాడు. క్యాటరింగ్ సర్వీస్ ను రన్ చేస్తూ ఉంటాడు. పెళ్లి చేసుకోవలసిన వయసు దాటిపోయి చాలాకాలమవుతుంది. స్నేహితులతో కలిసి తాగేస్తూ .. తిరిగేస్తూ ఉంటాడు. ఒక రోజున అతని పక్కింట్లోకి కొత్తగా ఒక ఫ్యామిలీ దిగుతుంది. తల్లిదండ్రులతో కలిసి ఆ ఇంట్లోకి దిగిన అమ్మాయి పేరే 'యాష్లే' ( మమితా బైజు). ఆమె తండ్రి తాగుబోతు అనీ .. ఆ అమ్మాయి డిగ్రీ చదువుతోందనే విషయం జస్టిన్ కి తెలుస్తుంది. 'యాష్లే'ను చూసిన ఆ ఊరు కుర్రాళ్లంతా మనసు పారేసుకుంటారు. ఆమె ఇంటిచుట్టూ చక్కర్లు కొడుతుంటారు. ముఖ్యంగా 'గ్లిక్సన్' ఆమె వెంటే తిరుగుతుంటాడు. జస్టిన్ కజిన్ సిస్టర్స్ రేష్మ – రియాలతో యాష్లేకి పరిచయమవుతుంది. వాళ్ల ద్వారానే ఆమె జస్టిన్ గురించి వింటుంది. ప్రేమించిన అమ్మాయిని పొందలేకపోయిన కారణంగానే అతను పెళ్లి చేసుకోలేదని తెలుసుకుంటుంది. అప్పటి నుంచి అతని పట్ల ఆమెకి ప్రత్యేకమైన అభిమానం పుడుతుంది. తనని యాష్లే ప్రేమిస్తుందని తెలుసుకున్న జస్టిన్ ఆ మాటను నమ్మలేకపోతాడు. ఇద్దరి మధ్యా ఉన్న ఏజ్ గ్యాప్ అందుకు కారణం. అయితే ఆమెనే స్వయంగా చెప్పడంతో ఆనందంతో పొంగిపోతాడు. అప్పటి నుంచి ఒకరికి ఒకరు మరింత చేరువైపోతారు. ఇద్దరూ కలిసి సరదాగా తిరుగుతుంటారు. అలాంటి పరిస్థితులలోనే యాష్లే మేనమామ 'అలెక్స్' ఆమె ఇంటికి వస్తాడు. జస్టిన్ కీ .. యాష్లే కి మధ్య ఏదో జరుగుతుందనే ఒక అనుమానం అతనికి వస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఆ ఎఫెక్ట్ ఆ ఇద్దరి జీవితాలపై ఎలా పడుతుంది? అనేది మిగతా కథ.సాధారణంగా ప్రేమ ..పెళ్లి అంటూ అమ్మాయిల వెంట అబ్బాయిలే పడుతుంటారు. తమ వయసు కాస్త ముదిరిపోయినట్టుగా అనిపిస్తే, కవర్ చేయడానికి నానా కష్టాలు పడుతుంటారు. అలా పెళ్లి చేసుకోకుండా ఉండిపోయిన ముదిరిపోయిన వ్యక్తి చుట్టూ, ఏజ్ గ్యాప్ చాలా ఎక్కువగా ఉన్న వ్యక్తిపై ఒక అమ్మాయి మనసు పారేసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన చుట్టూ అల్లుకున్న కథనే ఈ సినిమా.జస్టిన్ .. యాష్లే .. జస్టిన్ తమ్ముడు జోయెల్ .. యాష్లేను ఆరాధించే గ్లిక్సన్ .. యాష్లే మేనమామ అలెక్స్ .. ప్రధానమైన పాత్రలుగా కనిపిస్తాయి. ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉన్న వ్యక్తి పట్ల యాష్లే ఆకర్షితురాలు కావడం .. అతనికి తన మనసులోని మాటను చెప్పడం .. నమ్మలేని ఈ నిజాన్ని జీర్ణించుకోవడానికి అతను కొంత సమయం తీసుకోవడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ సాగుతుంది. ఇక తమ ప్రేమ విషయంలో పెద్దలకు సర్దిచెప్పే విషయంలో ఇద్దరూ పడే ఇబ్బందులతో సెకండాఫ్ కొనసాగుతుంది. దర్శకుడు ఈ కథలో ఏ విషయాన్ని కూడా ప్రేక్షకుల దగ్గర కాసేపైనా దాచిపెట్టే ప్రయత్నం చేయలేదు. కథను అందంగా .. ఆహ్లాదంగా చెప్పడానికి తనవంతు ప్రయత్నం చేస్తూ వెళ్లాడు. అందువల్లనే ఇంటర్వెల్ బ్యాంగ్ ఉండాలని గానీ, క్లైమాక్స్ కి హడావిడి చేయాలని గాని అనుకోలేదు. అసలు ఇది ఒక సినిమాగా కాకుండా, మనకళ్ల ముందు జరుగుతున్న సంఘటనలను వీధి అరుగుపై కూర్చుని చూస్తున్నట్టుగా ఉంటుంది. కథలో కావాలని కామెడీని ఇరికించే ప్రయత్నం చేయలేదు. సందర్భాన్ని బట్టి .. చిన్న చిన్న మాటలతనే నవ్వులు పూయించారు. నిజానికి అనువాద సినిమాలలో కామెడీ వర్కౌట్ కావడం కష్టం. కానీ ఈ సినిమాలో సంభాషణలు బాగానే కుదిరాయి. జోయెల్ .. గ్లిక్సన్ పాత్రల వైపు నుంచి కామెడీని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది.హీరోయిన్ చాలా ఏజ్ గ్యాప్ ఉన్న ఒక వ్యక్తిని ప్రేమిస్తుంది .. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఆమె అలా అనుకుందంటే ఆ వ్యక్తిలో గొప్ప లక్షణాలు ఉండాలి. అలాంటి లక్షణాలతో ఆ పాత్రను నడిపించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. తమ ప్రేమను వ్యక్తం చేసే విషయంలో .. అవతలవారి ప్రేమను అంగీకరించే విషయంలో ఆలస్యం చేయకూడదని భావించిన హీరో, తన తమ్ముడి ప్రేమ వివాహాన్ని దగ్గరుండి జరిపించడం హీరో పాత్రను మరింత ఎలివేట్ చేస్తుంది.'పెళ్లి'కి నమ్మకమే పునాదిరాయి అని అంటారు. అయితే ఆ నమ్మకం ప్రేమ నుంచే మొదలవ్వాలి అని చాటిచెప్పే కథ ఇది. నిజమైన ప్రేమ అందాన్ని .. ఆస్తులను .. ఏజ్ గ్రూప్ ను కాదు, మంచి మనసును వెదుకుతూ వెళుతుందనే సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది.

# మల్లన్న క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రం వైభవంగా స్వర్ణరథోత్సవం

## పాల్గొన్న ఈఓ శ్రీనివాసరావు దంపతులు





శ్రీశైలం (ప్రశ్నన్యూస్) ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి సభ్యురాలు జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు ఎ. శ్రీనివాసులు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# తుక్కాపూర్‌లో మినరల్ లిక్విడ్ పిచికారీ.

## గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చొరవ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో మినరల్ లిక్విడ్ పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజలకు, పశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించడంతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో లిక్విడ్ పిచికారీ చేయడంతో పరిసరాల్లో దుర్వాసన, దోమలు, ఇతర కీటకాల సమస్యలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు గ్రామపంచాయతీ కృషి చేస్తుందని సర్పంచ్ దొడ్డి ఆంజనేయులు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆరె రవీందర్, గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రశాంత్, వార్డు సభ్యులు సుదర్శన్, గంగయ్య, గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూరారం శివారులో పేకాట స్థావరంపై దాడి

## రూ.10,380 నగదు, పేకముక్కలు స్వాధీనం

## జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) శంకరంపేట(ఆర్) మండలంలోని సూరారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పేకాట ఆడుతున్న రణబోయిన విఠల్, ఉప్పరి గంగాధర్, బక్కన్న నర్సింలు, ఆమ్దా నాగరాజు, యాట దర్శన్లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి పేకాటకు వినియోగిస్తున్న రూ. 10,380 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అక్రమ పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట స్థావరాల నిర్వహణపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

# దామరమడుగులో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

## మల్లికార్జునస్వామి, కామాక్షితాయి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

## చేసిన: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం(ప్రశ్న న్యూస్) బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామంలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలపై దైవానుగ్రహం ఉండాలని ప్రార్థించారు. వసతి గృహాలు ప్రారంభంఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అర్చకుల వసతి గృహం, వాచ్‌మెన్ వసతి గృహాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్వాహకులతో ఆమె చర్చించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# సీజ్ చేసిన అక్రమ భవనానికి మళ్లీ ప్రాణం పోసింది ఎవరు.?

**- సీల్ తొలగించినది ఎవరు.? ఏ అధికారి అనుమతితో.? - జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం పై అనుమానాలు**





మలక్‌పేట్(ప్రశ్న న్యూస్) మలక్‌పేట్ సర్కిల్-27 పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు చేపడుతున్న చర్యలు కేవలం కంటితుడుపు చర్యలుగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హోరేబ్ హౌస్ ఆఫ్ వర్షిప్ చర్చి పక్కన నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు 2025 సెప్టెంబర్ 7న సీజ్ చేసి, కాషన్-- సీల్డ్ బోర్డు ఏర్పాటు చేసి నిర్మాణ పనులను నిలిపివేశారు. అయితే అదే భవనం ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశానికి సిద్ధమవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీజ్ చేసిన భవనం సీజ్ ఎలా తొలగించబడింది.? ఎవరి ఆదేశాలతో తొలగించారు.? అనే ప్రశ్నలు ఇప్పుడు జీహెచ్ఎంసీ అధికారులను వెంటాడుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, బయటకు సీజ్ బోర్డు అలాగే ఉంచి, లోపల మాత్రం నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు భవనం పూర్తయి వినియోగానికి సిద్ధమవడం అధికార యంత్రాంగం పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనలో అత్యంత కీలకమైన ప్రశ్నలు అనేకం ఉత్పన్నమవుతున్నాయి. సీజ్ చేసిన భవనానికి సీల్ తొలగించేందుకు జీహెచ్ఎంసీ ఏదైనా అధికారిక ఉత్తర్వులు జారీ చేసిందా.? ఒకవేళ జారీ చేసి ఉంటే ఆ ఉత్తర్వులు ఏమిటి.? భవన యజమానికి నిర్మాణం కొనసాగించేందుకు ఎలాంటి అనుమతులు ఇచ్చారు.? సీల్‌ను ఏ అధికారి, ఏ తేదీన తొలగించారు.? లేక అధికారుల అనుమతి లేకుండానే సీల్ తొలగించబడిందా.? అనే అంశాలపై డిప్యూటీ, జోనల్ కమిషనర్లు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన తర్వాత కూడా పనులు కొనసాగితే, సీజ్ చర్యల ఉద్దేశం ఏమిటనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఒకవైపు సాధారణ ప్రజలపై కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు, మరోవైపు ఇలాంటి భారీ నిర్మాణాల్లో మాత్రం మౌనం పాటించడం వెనుక కారణాలేమిటని స్థానికులు నిలదీస్తున్నారు. ఫిర్యాదులు అందిన, ఫోటోలు సమర్పించిన, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం, సీజ్ చేసిన భవనం చివరకు పూర్తవడం టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై జీహెచ్ఎంసీ కమిషనర్, చార్మినార్ జోనల్ కమిషనర్ తక్షణమే విచారణకు ఆదేశించి, సీల్ తొలగింపునకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే చట్టవిరుద్ధంగా సీల్ తొలగించి నిర్మాణం కొనసాగించి ఉంటే, భవన యజమానితో పాటు బాధ్యులైన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. "సీజ్ చేసిన భవనం గృహప్రవేశానికి సిద్ధమైతే.. జీహెచ్ఎంసీ సీజ్ చర్యలు కేవలం నాటకమా.? అనే ప్రశ్నకు ఇప్పుడు టౌన్ ప్లానింగ్ ఏసిపి, డిప్యూటీ కమిషనర్ సమాధానాలు చెప్పాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యలో విజయగాథ: పెరుగుతున్న విద్యా ఆకాంక్షలకు ప్రతీకగా ఒక సమాజం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నీట్ 2026లో వివిధ కోచింగ్ సంస్థల మార్గదర్శకత్వంలో ముస్లిం విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం కేవలం ఒక విద్యా విజయం మాత్రమే కాదు. ఇది మొత్తం సమాజానికి గర్వకారణమైన ఘనతగా, ఎంతోమంది యువతకు స్ఫూర్తినిచ్చే విజయగాథగా నిలుస్తోంది. నాణ్యమైన ఉన్నత విద్యను పొందడం ఇప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అనేక కుటుంబాలకు సవాలుగా ఉన్న సమయంలో, ఇలాంటి విజయాలు ఆశను, ప్రోత్సాహాన్ని కలిగించడంతో పాటు భవిష్యత్తుకు ఒక స్పష్టమైన మార్గాన్ని చూపిస్తున్నాయి. సరైన మార్గదర్శకత్వం, అవసరమైన వనరులు, అవకాశాలు అందిస్తే ప్రతిభ ఎక్కడ ఉన్నా వెలుగులోకి వస్తుందని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచగలదని ఈ విజయాలు నిరూపిస్తున్నాయి. ఈ విద్యార్థుల అద్భుత ఫలితాల వెనుక వారి కృషి, పట్టుదల మాత్రమే కాకుండా, వారి కుటుంబాలు చేసిన త్యాగాలు, విద్యార్థుల ప్రతిభను తీర్చిదిద్దేందుకు సమయం, జ్ఞానం, నైపుణ్యాలను అందించిన ఉపాధ్యాయులు, విద్యావేత్తల అంకితభావం కూడా ఉంది. వైద్యం, ఇంజినీరింగ్ లేదా ఇతర వృత్తిపరమైన కోర్సుల్లో ప్రవేశం పొందే ప్రతి విద్యార్థి విజయం కేవలం వ్యక్తిగత విజయంగా మిగిలిపోదు. తమ జీవితాలను విద్య ద్వారా మార్చుకోవాలని కలలు కంటున్న ఎంతోమంది యువతకు వారు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తారు. అందువల్ల ఇలాంటి విజయాలు కొన్ని వ్యక్తిగత ఉదాహరణలుగా మాత్రమే మిగిలిపోకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలను సమాజం ఒక కార్యాచరణకు పిలుపుగా భావించాలి. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, సామాజిక సంస్థలు, సమాజ నాయకులు కలిసి పనిచేసి మరింత మంది యువతను ఉన్నత విద్య, వృత్తిపరమైన కోర్సులు, పోటీ పరీక్షల వైపు ప్రోత్సహించాలి. ఏ సమాజం భవిష్యత్తు కేవలం దాని జనాభాతో నిర్ణయించబడదు. ఆ సమాజంలోని యువతకు అందుబాటులో ఉన్న విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు, అవకాశాలే దాని భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆశాజనకమైన మార్పులు కనిపిస్తున్నాయి. వైద్యం, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, న్యాయశాస్త్రం, పరిశోధన, సివిల్ సర్వీసెస్ తదితర వృత్తిపరమైన రంగాల వైపు విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఉన్నత విద్యపై అవగాహన ప్రతి ఇంటికీ చేరాలి. ముఖ్యంగా ఆర్థిక పరిస్థితుల కారణంగా లేదా సామాజిక పరిస్థితుల వల్ల ఉన్నత విద్య తమకు అందుబాటులో ఉండదని భావించే కుటుంబాల్లో విద్యపై అవగాహన మరింత పెరగాలి. ఈ విద్యార్థుల విజయగాథలు ఒక ముఖ్యమైన విషయాన్ని నిరూపిస్తున్నాయిప్రతిభ ప్రతి చోటా ఉంటుంది. దానికి అవసరమైనది సరైన మార్గదర్శకత్వం, మెంటార్‌షిప్, ఆర్థిక సహాయం మరియు నాణ్యమైన విద్యా వనరులకు ప్రాప్యత.

ఈ లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్న విద్యాసంస్థలు, కోచింగ్ సంస్థలు, సామాజిక సంస్థలు ప్రత్యేక అభినందనలకు అర్హులు. వారి పాత్ర కేవలం పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికే పరిమితం కాదు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి క్రమబద్ధమైన మార్గదర్శకత్వం, విద్యా సహాయం, ప్రోత్సాహం అందించడం ద్వారా వారు ఆశయం, క్రమశిక్షణ, విద్యా ప్రతిభతో కూడిన వాతావరణాన్ని నిర్మిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు విద్యా అసమానతలను తగ్గించడంలో, లేకపోతే మూసుకుపోయే అవకాశాలకు విద్యార్థులకు తలుపులు తెరవడంలో కీలక పాత్ర పోషించగలవు. ఈ కార్యక్రమాల ప్రభావం కేవలం పరీక్షల ఫలితాల్లోనే కనిపించడం లేదు. విద్యార్థుల ఆలోచనా విధానంలో కూడా మార్పు కనిపిస్తోంది. సాంప్రదాయ పరిమితులను దాటి ఆలోచించడానికి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, తమ సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవడానికి ఇవి యువతను ప్రోత్సహిస్తున్నాయి. అదే సమయంలో విద్యలో పెట్టుబడి పెట్టడం వల్ల దీర్ఘకాలికమైన, సానుకూలమైన మార్పులు సాధ్యమవుతాయని కుటుంబాలు, సమాజాల్లో విశ్వాసం కూడా పెరుగుతోంది. భారతదేశం జ్ఞానం, ఆవిష్కరణలు, నైపుణ్యాలతో కూడిన మానవ వనరుల ఆధారంగా భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, సమాజంలోని ప్రతి వర్గం ఉన్నత విద్యలో భాగస్వామ్యం కావడం ఎంతో అవసరం. ఈ నీట్ అభ్యర్థుల విజయం ఒక విషయాన్ని గుర్తుచేస్తోంది---విద్యాభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వాలు, విద్యాసంస్థలదే కాదు. కుటుంబాలు, సామాజిక సంస్థలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, సమాజంలోని ప్రతి ఒక్కరి క్రియాశీల భాగస్వామ్యంతోనే విద్యా పురోగతి సాధ్యమవుతుంది.

### యువతకు వారి విజయం ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది

ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకోండి. పట్టుదలతో ముందుకు సాగండి. అందుబాటులో ఉన్న అవకాశాలను సంకోచం లేకుండా వినియోగించుకోండి. సరైన మార్గదర్శకత్వాన్ని పొందండి. మీ సామర్థ్యంపై నమ్మకం ఉంచండి. విద్యా విజయం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు కూడా శక్తివంతమైన సాధనంగా మారగలదు.

ఈ యువ విద్యార్థుల విజయాలపై సమాజం గర్వపడటానికి ప్రతి కారణం ఉంది. అయితే అంతకంటే ముఖ్యంగా, ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి భవిష్యత్ తరాలకు బలమైన విద్యా సహాయ వ్యవస్థలను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది. ఈరోజు విద్యార్థులు సాధించిన విజయం అంతిమ గమ్యం కాదు; మరెంతో మంది యువత పెద్ద కలలు కనడానికి, మరింత కష్టపడి పనిచేయడానికి, విద్య ద్వారా ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి స్ఫూర్తినిచ్చే ఒక గొప్ప విద్యా మేల్కొలుపుకు ఇది ఆరంభం కావాలి

# ఈటల శపథం.. పేదల భూముల కోసం పోరాటం ఆగదని హెచ్చరిక

- ఇందిరాపార్క్ వద్ద బీజేపీ దీక్షలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- పేదల ఇళ్లు, భూముల విషయంలో అన్యాయాన్ని అడ్డుకుంటామని స్పష్టం
- 22ఏ బాధితులకు పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్

హైదరాబాద్( ప్రశ్న న్యూస్ ) ప్రజల భూములు, ఇళ్ల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించబోమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ శపథం చేశారు. 22ఏ బాధితులకు అండగా శనివారం ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు చేపట్టిన దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, 22ఏ నిషేధిత జాబితా కారణంగా ముఖ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బాధితులు స్వచ్ఛందంగా బస్సులు ఏర్పాటు చేసుకుని దీక్షకు తరలివచ్చారని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ గిరినగర్‌లో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని ఆరోపిస్తూ, పేదలపై జరుగుతున్న చర్యలను అడ్డుకునేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలకు ప్రజల భూములను 22ఏలో చేర్చే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.

### అధికారులకు ఈటల హెచ్చరిక

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కేవలం "యస్ బాస్" అంటూ పనిచేస్తే భవిష్యత్తులో జవాబుదారీతనం తప్పదని ఈటల రాజేందర్ హెచ్చరించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి విధుల్లోకి వచ్చిన విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. పేదల ఇళ్లు, భూముల విషయంలో అధికారులు అన్యాయంగా వ్యవహరిస్తే వారిని వదిలిపెట్టబోమని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజాప్రతినిధులను అడ్డుకుంటే పోలీసులపై కూడా చట్టపరమైన చర్యలకు వెళ్తామని హెచ్చరించారు.

### 22ఏ జీవోపై ప్రశ్నల వర్షం

22ఏ నిషేధిత జాబితా విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఈటల ఆరోపించారు. సీసీఎల్ఏ, కలెక్టర్లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మధ్య జరిగిన అధికారిక లేఖల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, ఈ అంశంపై మంత్రులు ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హెచ్చరించారు. కొన్ని దరఖాస్తులు మాత్రమే వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఒక్క నర్సాపూర్ ప్రాంతంలోనే వేలాది మంది రైతుల భూములు ఈ జాబితాలో ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోందని అన్నారు. ఐదు, ఆరు తరాలుగా సాగు చేసుకుంటున్న భూముల హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### పేదల భూములు, ఇళ్ల కోసం పోరాటం

గాజులరామారం, అస్మత్‌పేట, గిరినగర్, మహేంద్రహిల్స్, బహదూర్‌గూడ తదితర ప్రాంతాల్లో పేదలు, రైతులు, నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈటల ప్రస్తావించారు. దశాబ్దాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లు, భూములపై చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. గాజులరామారంలో దశాబ్దాలుగా నివసిస్తున్న వడ్డెర కుటుంబాలపై జరిగిన చర్యలను ప్రస్తావిస్తూ, వారి జీవనాధారాలను తొలగించడం అమానుషమని ఆరోపించారు.

### భూముల వ్యవహారాలపై ఆరోపణలు



మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ, పారిశ్రామిక సంస్థలకు సంబంధించిన విలువైన భూముల వ్యవహారాలపై కూడా ఈటల రాజేందర్ ప్రశ్నలు లేవనెత్తారు. గత ప్రభుత్వం చేపట్టిన భూ వ్యవహారాలను ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు పునఃసమీక్షించడం లేదని ప్రశ్నించారు. పుప్పాలగూడలో 134 ఎకరాల భూమికి సంబంధించిన మార్పులపై కూడా ఆయన ఆరోపణలు చేశారు. రాత్రికి రాత్రే భూభారతి రికార్డుల్లో మార్పులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, భూముల కొనుగోలు వ్యవహారాలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

### కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం

22ఏ బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని ఈటల రాజేందర్ తెలిపారు. అవసరమైతే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలకు కూడా ఫిర్యాదు చేసి బాధితుల సమస్యలపై పోరాడతామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్న ఆయన, పేదల భూములు, ఇళ్లు, హక్కులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఈటల రాజేందర్ ప్రకటించారు.

## అనుమతులు గాలికి, ఓసీలు చేతికి

# అక్రమ నిర్మాణాలకు 'ఓసీ' కవచం

- ఓసీ దందాలో లక్షల వసూళ్లు.?- అక్రమ భవనాలకు అధికారిక ముద్ర - సికింద్రాబాద్ జోన్‌లో 'ఓసీ'ల గోల
- రూ.50 లక్షల వరకు ఓసీ రేటా.? - మధ్యవర్తుల చేతిలో టౌన్‌ప్లానింగ్ ఫైళ్లు
- ఓసీ ఇచ్చి అక్రమాలను సక్రమం చేస్తున్నారా.? - విజిలెన్స్ దృష్టి సారిస్తే ఓసీల బాగోతం బట్టబయలు
- ఓసీ దందాలో కాసుల వర్షం.. ఖజానాకు కోట్ల నష్టం.?

సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగమే వాటికి అండగా నిలుస్తోందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీలు) జారీ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓసీ చేతికి వస్తే చాలు అక్రమ నిర్మాణం కాస్తా సక్రమ నిర్మాణంగా మారిపోతుందన్న పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఓసీ వస్తే అంతా ఓకేనా.?

నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినా, సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించినా, పార్కింగ్ స్థలాలను ఆక్రమించినా చివరకు ఓసీ జారీ అయితే విద్యుత్ మీటర్లు, నీటి కనెక్షన్లు, ఆస్తి పన్ను వంటి వ్యవహారాలు సైతం సులభంగా సక్రమం అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన వ్యవస్థే వాటికి చట్టబద్ధత కల్పిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండి ఫిర్యాదులు చేస్తే వెంటనే వాటిని జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్లు గతంలో పేర్కొన్న వాటిపై వస్తున్న ఫిర్యాదులపై ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఒక్కో ఓసీ వెనుక రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలా.?

సికింద్రాబాద్ జోన్ పరిధిలోని పలు సర్కిళ్లలో ఓసీ జారీ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారుతున్నట్లు ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో ఓసీ కోసం రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటిపై విజిలెన్స్ అధికారులచే పూర్తిస్థాయి విచారణ చేయిస్తే వాస్తవాలు బయటికి వస్తాయని ప్రజలు కోరుతున్నారు. సర్కిల్ కార్యాలయం నుంచి జోనల్ కార్యాలయం, అక్కడి నుంచి ప్రధాన కార్యాలయం వరకు మధ్యవర్తుల నెట్‌వర్క్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరుగా అధికారులను కలవాల్సిన అవసరం లేకుండా 'పని పూర్తి చేస్తాం' అంటూ మధ్యవర్తులు వ్యవహారాలను చక్కబెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత.? ఏ ఏ అధికారి ఇప్పటివరకు ఎన్ని ఓసిలు అక్రమ మార్గంలో జారీ చేశారు. అన్నది దర్యాప్తుతోనే తేలాల్సి ఉంది.


### ప్రభుత్వ ఖజానాకు భారీ గండి

అక్రమ నిర్మాణాలకు ఓసీలు జారీ అయితే కేవలం నిబంధనల ఉల్లంఘనే కాదు. ప్రభుత్వ ఆదాయానికీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులు, మార్పులు, వినియోగ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు, ఫీజులు, ఇతర ప్రభుత్వ బకాయిలు వసూలు కాకపోతే కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని ఇప్పటికే నగరంలో లక్షలలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి వాటిపై ప్రభుత్వానికి టాక్స్ రూపంలో నిధులు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి మరి దీనిపై ప్రభుత్వం ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది.

### సర్కిల్.. జోన్.. హెడ్‌ఆఫీసు..

ఓసీల జారీ ప్రక్రియలో ఏ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కేవలం ఒక సర్కిల్ స్థాయిలోనేనా.? జోనల్ స్థాయిలోనూ వ్యవహారం సాగుతోందా.? ప్రధాన కార్యాలయంలోనూ ఫైళ్లకు 'క్లియరెన్స్' లభిస్తోందా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో గత కొన్నేళ్లలో జారీ చేసిన ఓసీలపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు, నిర్మాణ స్థితి, ఫైల్ నోటింగ్స్, తనిఖీ నివేదికలు, ఓసీ జారీ తేదీలు, సంబంధిత అధికారుల నిర్ణయాలను పరిశీలిస్తే అక్రమ ఓసీల జారీ దందాలు, అక్రమాలకు సంబంధించిన అసలు గుట్టు బయటపడే అవకాశం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

### సికింద్రాబాద్ జోన్ ఫైళ్లను బయటకు తీయాలి




సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో జారీ చేసిన ఓసీలను ర్యాండమ్‌గా పరిశీలించి, అనుమతులకు అనుగుణంగా నిర్మాణం ఉందా.? వాస్తవ పరిస్థితిని అధికారులు తనిఖీ చేశారా.? నిబంధనల ఉల్లంఘనలను ఎందుకు పట్టించుకోలేదు.? అనే అంశాలపై ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.అక్రమ నిర్మాణాలకు ఓసీలు ఇచ్చి ప్రభుత్వానికి ఆర్థిక నష్టం చేయడంతో పాటు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్మాణాలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు బాధ్యత ఎవరిది.? అధికారులపై వస్తున్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు ఓసీ లు ఇచ్చే వ్యవహారంపై కమిషనర్లు సమగ్ర దర్యాప్తు జరిగితే ఎన్ని ఫైళ్లు బయటపడతాయి.? ఎన్ని కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా ఆగిపోయాయి.? అసలు ఈ దందా వెనుక ఎవరి హస్తం ఉంది.? అన్న ప్రశ్నలకు సమాధానం ఖచ్చితంగా దొరకాల్సిందే.

## పీసీబీపై ఇమ్రాన్ ఖాన్ కుమారుల తీవ్ర విమర్శలు

- లార్డ్స్ టెస్టు వివాదంపై ఫైర్



లాహోర్ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ కుమారులు సులేమాన్, ఖాసిం.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన లార్డ్స్ టెస్టు సందర్భంగా పీసీబీ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ, వారు తమను తాము ఫూల్స్‌గా మార్చుకున్నారని ఘాటుగా విమర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టు మొదటి రోజు, స్కై స్పోర్ట్స్ ఛానెల్‌లో ఇమ్రాన్ కుమారులు సులేమాన్, ఖాసింల ఇంటర్వ్యూ ప్రసారమైంది. మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో, వారు జైల్లో ఉన్న తమ తండ్రి క్షీణిస్తున్న ఆరోగ్యం, జైలు పరిస్థితులపై మాట్లాడారు. ఈ ఇంటర్వ్యూ ప్రసారాన్ని నిలిపివేయకపోతే లంచ్ విరామం తర్వాత బరిలోకి దిగబోమని పీసీబీ బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వివాదంపైనే ఇమ్రాన్ కుమారులు స్పందించారు."వారు (పీసీబీ) తమను తాము పూర్తిగా ఫూల్స్‌గా మార్చుకున్నారు" అని ఖాసిం వ్యాఖ్యానించారు. పీసీబీ స్పందన చూసి షాక్‌కు గురయ్యానని సులేమాన్ అన్నారు. "మా ఇంటర్వ్యూను తొలగించాలని పీసీబీ కోరడం వారి పరిధిలో లేదు. మేం మాట్లాడింది రాజకీయాల గురించి కాదు, మానవతా దృక్పథంతో ఆయన ఆరోగ్యం గురించే" అని సులేమాన్ వివరించారు. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో, ఇమ్రాన్ భద్రతపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "జైల్లోనే ఆయన్ను చంపేయాలని వారు స్పష్టంగా చూస్తున్నారు. వీలైనంత రహస్యంగా ఆయన్ను నిశ్శబ్దం చేసి, నెమ్మదిగా కనుమరుగు చేయాలని ప్రయత్నిస్తున్నారు" అని వారు సంచలన ఆరోపణలు చేశారు.అయితే, ఇమ్రాన్ ఖాన్‌కు పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నామని, ఆయనపై దుష్ప్రవర్తన ఆరోపణలను పాకిస్థాన్ అధికారులు ఖండిస్తూ వస్తున్నారు. ఈ వాదనలను సులేమాన్ తోసిపుచ్చారు. "ప్రభుత్వ వర్గాలు చెప్పే మాటల్లో పారదర్శకత లేదు. మాకు ఎలాంటి ఆధారాలు చూపించడం లేదు. అలాంటప్పుడు మేం ఎలా నమ్మాలి? ఆరు నెలల క్రితం తన కంటి సమస్య గురించి ఆయనే స్వయంగా మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యంపై మాకు ఎలాంటి స్పష్టమైన సమాచారం లేదు" అని సులేమాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

- బీఆర్ఎస్ అనే మొక్క వాడిపోయిందని టీపీసీసీ చీఫ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బీజేపీ అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు.

# పాలు లేకుండానే పన్నీర్ తయారీ

## గ్రేటర్‌లో విచ్చలవిడిగా కల్తీ పన్నీర్ దందా

- అధికారుల చర్యలకు కల్తీ రాయుళ్లకు భయం లేదా.?
- కొంతమంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తీరుపై అనుమానాలు
- నాణ్యత లేని ఆహారంతో అనారోగ్యాల బారిన పడుతున్న ప్రజలు
- ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపాలంటున్న ప్రజాసంఘాలు
- తయారీ కేంద్రాలపై దాడులు ఎందుకు లేవు.. మేనేజ్ చేస్తున్నారా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలు లేకుండానే పన్నీర్ తయారు చేస్తున్న అక్రమార్కులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు నగరంలో కలకలం రేపుతున్నాయి. నాణ్యమైన పాలతో తయారు చేయాల్సిన పన్నీర్ స్థానంలో చౌకగా లభించే పదార్థాలను వినియోగించి కల్తీ పన్నీర్ తయారు చేసి హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్లు, స్వీట్ షాపులకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ ధరకు లభిస్తుండటంతో వ్యాపారులు సైతం కల్తీ పన్నీర్ వైపే మొగ్గుచూపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.



### దాడులు.. కేసులు.. అయిన అదే దందా

కల్తీ పన్నీర్ తయారీ కేంద్రాలపై గతంలో అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, కొద్ది రోజులకే అదే ప్రాంతాల్లో తిరిగి దందా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంటే అధికారులకు లంచాలు ఇచ్చి అదే దందా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హెచ్-ఫాస్ట్ వంటి తనిఖీ బృందాలు దాడులు నిర్వహించినా, అక్రమార్కులు కొంతకాలం కార్యకలాపాలు నిలిపివేసి మళ్లీ యథావిధిగా వ్యాపారం సాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దాడులు కేవలం తాత్కాలికంగా మారుతున్నాయా.? లేక అక్రమ దందాకు తెరవెనుక సహకారం అందుతోందా.? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

### అధికారుల అండతో కల్తీ సామ్రాజ్యం.?

కల్తీ పాలు, పెరుగు, పన్నీర్ తయారీ, సరఫరా, విక్రయాలపై నిఘా పెట్టాల్సిన కొంతమంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అక్రమ తయారీ కేంద్రాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన, పత్రికలలో కథనాలు వచ్చిన అధికారులు అసలు పట్టించుకోవడం లేదని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. హెచ్ ఫాస్ట్ ప్రస్తుతం ఇన్ని దాడులు చేసి కల్తీ పన్నీర్ ను పట్టుకుంటే మరి ఇన్ని సంవత్సరాలుగా ఫుడ్ ఇన్స్పెక్టర్లు పట్టుకోలేదు అంటే ఎంత భారీ స్థాయిలో అమ్ముడుపోయారు అర్థం చేసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తరచూ దాడులు జరిగే ప్రాంతాల్లోనే మళ్లీ కల్తీ ఉత్పత్తులు బయటపడుతుండటం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి, అక్రమార్కులకు సహకారం నిర్ధారణ అయితే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### కల్తీ పన్నీర్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు

కల్తీ పన్నీర్‌ను నిరంతరం వినియోగించడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు కల్తీ ఆహార పదార్థాల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. పన్నీర్ మాత్రమే కాకుండా కల్తీ పాలు, కల్తీ పెరుగు కూడా మార్కెట్‌లోకి వస్తుండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రత అధికారులు కేవలం నమూనాలు సేకరించడం, కేసులు నమోదు చేయడంతో సరిపెట్టకుండా తయారీ కేంద్రాల మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో హబ్సిగూడ నందు ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్న వ్యవహారంను వెలుగులోకి తెచ్చిన రిపోర్టర్ల పైనే పోలీసులు కేసు నమోదు చేయడం చూస్తుంటే కల్తీ రాయుళ్లకు అధికారుల అండదండలు ఎంత పుష్కలంగా ఉన్నాయో అర్థమవుతుంది. కొంతమంది అధికారుల అండదండలు ఇంత భారీ స్థాయిలో ఉంటే వాటిని కట్టడి చేయడం ఉన్నత అధికారులతో అయ్యేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

### తెలంగాణలో పన్నీర్‌పై కఠిన నియంత్రణ అవసరం

కల్తీ పన్నీర్ దందాను అరికట్టాలంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. అవసరమైతే అనుమతులు, నాణ్యత ప్రమాణాలు, తయారీ విధానాలపై మరింత కఠిన నియంత్రణలు విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. తయారీ కేంద్రాల నుంచి హోల్‌సేల్ మార్కెట్లు,



హోటళ్లు, రెస్టారెంట్ల వరకు సరఫరా గొలుసును గుర్తించి తనిఖీలు చేపట్టాలని అంటున్నాయి. అక్రమంగా తయారు చేస్తున్న వారిపై కేసులతో పాటు పునరావృత నేరాలకు కఠిన శిక్షలు విధిస్తేనే భయం ఏర్పడుతుందని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి. అయితే నగరంలో వెజిటేబుల్ దాబాలలో కల్తీ పన్నీర్ తో తయారు చేసిన ఆహార పదార్థాలు అమ్ముతున్నారని కొంతమంది డాబాల యజమానులు ఏకమై కల్తీ పన్నీర్ దారులతో చేతులు కలిపి గుర్తుచప్పుడు కాకుండా తయారు చేయించుకొని అమ్మకాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### యాదాద్రి జిల్లా కేంద్రంగా కల్తీ పన్నీర్ దందా.?

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంగా కల్తీ పన్నీర్ తయారీ కేంద్రాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల హబ్సిగూడ, అల్వాల్, కుషాయిగూడ వంటి ప్రాంతాలలో దొరుకుతున్న కల్తీ పన్నీర్ ప్యాకింగ్ లపై మ్యానుఫ్యాక్చరింగ్ యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో జరుగుతున్నట్లు అడ్రస్లు ఉన్నాయి. అక్కడి నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు కల్తీ పన్నీర్ సరఫరా జరుగుతుంది అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిజంగానే అక్రమ తయారీ కేంద్రాలు ఉంటే వాటిపై వరుస దాడులు ఎందుకు జరగడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమార్కులు అధికారులను మేనేజ్ చేస్తున్నారా.? లేక అధికారుల నిఘా వైఫల్యమా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో రాజీకి తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఫుడ్ సేఫ్టీ విభాగం, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కల్తీ పన్నీర్ తయారీదారులతో పాటు వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నాయకులు, రిపోర్టర్లు, అధికారులపైనా విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే పేరుకు దాడులు, కేసులు ఎన్ని జరిగినా కల్తీ దందా మాత్రం ఆగే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 67 రూపాయల కోసం 32 ఏళ్లుగా వివాదం

- ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రూ.67 కోసం ఒక బస్ కండక్టర్‌తో మొదలైన చిన్న వివాదాన్ని ఏకంగా 32 ఏళ్లుగా కొనసాగించిన ఢిల్లీ రవాణా సంస్థ (డీటీసీ) తీరుపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ధనాన్ని, న్యాయస్థానాల విలువైన సమయాన్ని వృథా చేసినందుకు డీటీసీకి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ సెప్టెంబర్ 2న కీలక తీర్పు వెలువరించింది. ఇటువంటి అనవసరమైన వ్యాజ్యాలతో న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేశారని ఘాటుగా వ్యాఖ్యానించింది.కేసు వివరాల్లోకి వెళితే, 1994 నవంబర్‌లో రాజేందర్ ప్రసాద్ అనే కండక్టర్ ముగ్గురు ప్రయాణికుల నుంచి రూ.67 ఛార్జీ వసూలు చేసి టికెట్లు ఇవ్వలేదని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ ఘటనపై జరిగిన విచారణలో అధికారి ఆయనకు అనుకూలంగా నివేదిక ఇచ్చినా, డీటీసీ మాత్రం 1996లో అతడిని సర్వీసు నుంచి తొలగించింది. ఆ తర్వాత 1998లో తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నప్పటికీ, 17 నెలల బకాయి వేతనాల చెల్లింపు విషయంలో వివాదాన్ని కొనసాగించింది.ఈ బకాయిల చెల్లింపునకు సంబంధించి 2004లోనే ఇండస్ట్రియల్ ట్రైబ్యునల్ కండక్టర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, డీటీసీ ఆ తీర్పును సవాలు చేస్తూ దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉంది. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ అమిత్ మహాజన్, డీటీసీ వాదనలను తోసిపుచ్చారు. "ఇంత చిన్న వివాదాన్ని దశాబ్దాలుగా కొనసాగించడం ఆమోదయోగ్యం కాదు" అని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేశారు. కోర్టు విధించిన లక్ష రూపాయల జరిమానాలో రూ. 50,000 ప్రధానమంత్రి సహాయ నిధికి, రూ. 25,000 బాధితుడైన కండక్టర్ రాజేందర్ ప్రసాద్‌కు, మరో రూ. 25,000 ఢిల్లీ హైకోర్టు న్యాయ సేవల కమిటీకి చెల్లించాలని ఆదేశించారు. అంతేకాకుండా, ఈ అనవసర వివాదానికి కారణమైన అధికారుల నుంచి జరిమానా మొత్తాన్ని వసూలు చేసుకునే స్వేచ్ఛ డీటీసీకి ఉందని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588